ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 20-06- 2026 | సంపుటి: 17, సంచిక: 77, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

### మాదక ద్రవ్యాల ముఠాలపై

# ఉక్కుపాదం

**ఎల్‌బీ స్టేడియంలో వేలాది మంది విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ**



**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో యువతకు చైతన్య సందేశం**

**సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం**

**డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం విద్యార్థులే మార్పుకు మార్గదర్శకులని పిలుపు**

**హైదరాబాద్, జూన్ 19 (ప్రజాకలం) :** సమాజాన్ని నిశ్శబ్దంగా కబళిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిపై తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పోరాటం కొనసాగిస్తోంది. యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే డ్రగ్స్ అనే సామాజిక దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో భారీ స్థాయిలో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి, సమాజాన్ని కూడా మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,

తరువాయి 2వ పేజీలో...



### 20 ప్రాంతాల్లో ఆధునిక

# ధాన్య సైలోలు

**ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు**

**రైతులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థ కొనసాగుతుంది**

**ఎస్‌హెచ్‌జీలు, పీఏసీఎస్‌ల పాత్ర యథాతథం**

**మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 19 (ప్రజాకలం) :** రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

### రాష్ట్రంలో దశల వారీగా

# భూముల రీసర్వే

**భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం**

**వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, జూన్ 19 (ప్రజాకలం) :** భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో

తరువాయి 2వ పేజీలో...

### ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై

# రాజీలేని పోరాటం

## ముగ్గురు బందిపోట్ల చేతిలో జిల్లా

**ప్రజా సమస్యలే అజెండాగా తెలంగాణ రక్షణ సేన - ప్రజలే ఎజెండాగా తెలంగాణ రక్షణ సేన పార్టీ పుట్టింది**

**జిల్లాలో టీఆర్ఎస్ బొగ్గు బాయి బాట - టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**




పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు,సింగరేణిలో నెలకొన్న అప్రకటిత ఎమర్జెన్సీ,జిల్లాలోని ప్రధాన సమస్యలపై తెలంగాణ రక్షణ సేన రాజీలేని పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో నాలుగు రోజుల పాటు సాగిన బొగ్గుబాయి బాట యాత్ర ముగింపు సందర్భంగా శుక్రవారం ఆమె పెద్దపల్లికి చేరుకున్నారు.

తరువాయి 2వ పేజీలో...

# సంపద సృష్టి దిశగా అడుగులు

## పొరుగు రాష్ట్రాలకు ఇసుక ఎగుమతిపై అధ్యయనం

**పీపీపీ మోడల్‌లో పర్యాటక ఆస్తుల అభివృద్ధి - టెంపుల్, ఎకో, హెల్త్ టూరిజంపై దూకుడు**

**పర్యాటకం, రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**వీకెండ్స్‌లో హెలికాప్టర్ పర్యటకానికి ప్రణాళికలు - ఖజానాకు ఆదాయమే లక్ష్యం**




**హైదరాబాద్, జూన్ 19 (ప్రజాకలం) :** ప్రభుత్వానికి ఆదాయ వనరులు తీసుకువచ్చే రంగాలపై పూర్తిగా దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మన వనరులే మన పెట్టుబడి అని ఆయన అన్నారు. శుక్రవారం నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోరి పర్యాటక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పర్యాటక కేంద్రాల్లోని ప్రభుత్వ భూములు, స్థలాలను సమర్థవంతంగా వినియోగించి ఖజానాకు ఆదాయాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. గోవా, కేరళ వంటి రాష్ట్రాలు పర్యాటకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...

### నిందితుల్ని

# వదిలిపెట్టం

**- అయోధ్య రామమందిరం విరాళాల స్కాంపై యూపీ సీఎం యోగి వార్నింగ్**



అయోధ్య: ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాం టివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సీఎం హెచ్చరించారు.

తరువాయి 2వ పేజీలో...

### క్షయ రహిత తెలంగాణ

# రాష్ట్రమే లక్ష్యంగా కృషి

**రాష్ట్రంలో 2492 గ్రామాలలో క్షయ వ్యాధి నిర్మూలనకు హెల్త్ స్క్రీనింగ్**

**క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం అండగా ఉంది**

**నవజాత శిశు మరణాలను తగ్గించటానికి చర్యలు చేపట్టాం**

**-: మంత్రి దామోదర్ రాజనర్సింహా**



**హైదరాబాద్, జూన్ 19 (ప్రజాకలం) :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా గారు దేశంలో క్షయ, మాతశిశు సంరక్షణ, నివారణ కార్యక్రమాలపై అన్ని రాష్ట్రాల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహా గారు హైదరాబాద్ లోని రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం సమావేశమందిరం నుండి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో క్షయ నిర్ధారణ పరీక్షలు

తరువాయి 2వ పేజీలో...

### రైతాంగాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్

# భేషరతుగా క్షమాపణ చెప్పాలి

**- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు**



**సిద్దిపేట, జూన్ 19 (ప్రజాకలం) :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మది నం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణ యించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకు? అని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని రేవంత్ రెడ్డి మంత్రి వర్గాన్ని ఆయన అభివర్ణించారు. మీది విశ్వాసఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

# మాదక ద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి...

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎల్‌బీ స్టేడియం మొత్తం యువతతో నిండిపోగా, డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, మొత్తం కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని, దేశ భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర వ్యసనమని హెచ్చరించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, అలాగే తమ స్నేహితులను, తోటి విద్యార్థులను కూడా ఈ ముప్పు నుంచి కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతిజ్ఞలో భాగంగా విద్యార్థులు "మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములమవుతాం. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తాం. మాదక ద్రవ్యాల బారిన ఎవరూ పడకుండా అవగాహన కల్పిస్తాం. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం" అంటూ ఘనంగా ప్రమాణం చేశారు. వేలాది మంది విద్యార్థులు ఏకకంఠంతో చేసిన ప్రతిజ్ఞ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ వ్యాపారులపై రాజీ లేని పోరాటం కొనసాగిస్తోందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ ముఠాలు సమాజంలో వేళ్లు పాతేందుకు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. డ్రగ్స్ సమస్యను కేవలం పోలీసుల బాధ్యతగా కాకుండా సామాజిక ఉద్యమంగా చూడాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేస్తేనే ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించవచ్చని అన్నారు. యువతలో అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తు తరాలను రక్షించగలమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు కూడా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రకటించారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, డ్రగ్స్ ప్రమాదాలపై సహచర విద్యార్థులకు వివరించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై అధికారులకు సమాచారం అందించడం వంటి చర్యల్లో భాగస్వాములమవుతామని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యువతను లక్ష్యంగా చేసుకుని విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల ముప్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల భాగస్వామ్యంతో డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ కార్యక్రమం బలమైన నాంది పలికింది.

డ్రగ్స్ రహిత తెలంగాణ సాధన లక్ష్యంగా ప్రభుత్వం, ప్రజలు, యువత కలిసి ముందుకు సాగాలని ఈ వేదిక నుంచి పిలుపునిచ్చారు. సమాజ భవిష్యత్తును కాపాడే దిశగా ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ఈ మహా ప్రతిజ్ఞ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

# రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే

మొదటి పేజీ తరువాయి...

భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

### ప్రతి సర్వే నంబర్‌కు భూదార్

భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు.

రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

# 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్య సైలోలు

మొదటి పేజీ తరువాయి...

ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

ఈ సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.

"తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం" అని మంత్రి తెలిపారు.

పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు.

ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు.

రైల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు. "ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కార్యాలయం నుండి విడుదల చేయడమైనది,

### ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై

# రాజీలేని పోరాటం

మొదటి పేజీ తరువాయి...

రామగుండం నుంచి పెద్దపల్లికి చేరుకున్న కవితకు పార్టీ శ్రేణులు శాంతినగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, భారీ బైక్ ర్యాలీతో ఆమెను పెద్దపల్లి బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. మార్గమధ్యలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, అయ్యప్ప ఆలయ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలో నూతనంగా నిర్మించిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సమస్యలే తమ ఎజెండాగా పుట్టిన పార్టీ తెలంగాణ రక్షణ సేన అని, రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి, ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించి అధికారం ఇవ్వాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం తాము ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కవిత అన్నారు. గతంలో అమల్లో ఉన్న వారసత్వ ఉద్యోగాల ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడం వల్ల కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విధానాన్ని పునరుద్ధరించాలని, కొత్త గనులను ప్రారంభించి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో భట్టి విక్రమార్క, జిల్లా స్థాయిలో మంత్రులు శ్రీధర్ బాబు, ప్రేమసాగర్ రావులను ముగ్గురు బందిపోట్లుగా అభివర్ణించిన కవిత, కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని విమర్శించారు. ఇసుక, మట్టి, బూడిద దందాలతో అధికార పార్టీ నేతలు బిజీగా ఉన్నారని, ఓటు వేస్తే బోనస్‌గా వస్తున్న వారి కుటుంబ సభ్యులు అధికారులను, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ లంచాలు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పెద్దపల్లి జిల్లాలోనే వడ్ల కొనుగోలులో జాప్యం వల్ల ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా కేవలం ఏడు రకాల వడ్లకే బోనస్ ఇవ్వడం రైతులను వంచించడమేనని, యాసంగి రైతు భరోసాను రెండు ఎకరాలకే పరిమితం చేసి, వానాకాలం సాయంపై స్పష్టత లేకపోవడంపై ఆమె మండిపడ్డారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, మంథని నియోజకవర్గంలోని డి-86 కాలువ మరమ్మతులు, చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు సర్వేలపై ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కాళేశ్వరం బ్యాక్‌వాటర్ బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇక, ఢిల్లీని మించిన కాలుష్యంతో రామగుండం ప్రజలు, కార్మికులు క్యాన్సర్ బారిన పడే పరిస్థితి ఉందని, కార్మికుల ఆరోగ్యం కోసం వెంటనే అక్కడ ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ఎంపీని డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చి, కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో కేవలం 5 వేల పోస్టులు మాత్రమే ఇవ్వడం నిరుద్యోగులను అవమానించడమేనని కవిత పేర్కొన్నారు. ప్రిపేర్ అవుతున్న లక్షలాది మంది యువత భవిష్యత్తు దృష్ట్యా ఈ పోస్టులను కనీసం 20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే జంక్షన్ సమస్యలతో పాటు, పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల్లోనే సింహం గుర్తును ఆదరించిన పెద్దపల్లి ప్రజలు, రాబోయే రోజుల్లో తమకు మరింత మద్దతునిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమురయ్య, నాయకులు బాలాజీరావు, మాజీ మంత్రి బోడ జనార్దన్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సంపద సృష్టి దిశగా అడుగులు

మొదటి పేజీ తరువాయి...

ఆయా రాష్ట్రాల్లో ప్రజలకు ఉపాధిని కల్పించడమే కాకుండా జీడీపీ పెరుగుదలకు టూరిజం ఉపయోగపడుతోందని చెప్పారు. మన రాష్ట్రంలోనూ టూరిజాన్ని అలగే అభివృద్ధి చేయాలని అధికారులకు ఆయన సూచించా రు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం రంగాల్లో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. వారాంతాల్లో హెలీకాప్టర్ టూరిజాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ లో పర్యటకాన్ని అభివృద్ధి చేసే ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో టూరిజం ఆస్తులు పూర్తి స్థాయిలో వినియోగంలో లేవన్నారు. వాటిని పీపీపీ మోడల్లో అభివృద్ధి చేసి సంపద సృష్టించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచనలు చేశారు. ఆదాయ సమీకరణలో పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి లక్ష్యాల సాధనలో పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఏకో టూరిజం, హెల్త్ టూరిజం, టెంపుల్ టూరిజంలో అవకాశాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పీపీపీ ఆధారిత సమగ్ర పర్యాటక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కేబినెట్ ముందుంచాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన విధానపరమైన అంశాలను కేబినెట్ ముందుంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష చేసింది. చట్టపరమైన నిబంధనలు పాటించే క్రషర్లకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ అభిప్రాయ పడింది. లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులపై కేబినెట్ పబ్ కమిటీ సమీక్ష చేసింది. చరంగా నిబంధనలు పాటించే క్రషర్ల నిర్వాహకులకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. నది ఇసుకతో పోలిస్తే రోబో శాండ్ తక్కువ ధరకు లభిస్తోందని సబ్ కమిటీ గుర్తించింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు ఇసుకను ఎగుమతి చేయడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా స్లాబ్ అధారిత భూముల విలువ సవరణ వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. రవాణాశాఖకు సంబంధించి ఆదాయం... వసూళ్లు పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ కమిటీ సకమీక్ష్ చేసింది. అందులో భాగంగా బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ల విషయంలో పన్నులపై రాష్ట్ర అధికారాన్ని సమర్థిస్తూ కేరళకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చినట్లు సబ్ కమిటీ గుర్తించింది. భారత్ సిరీస్ రిజిస్ట్రేషన్లపై చట్టపరమైన, విధానపరంగా తీసుకోవల్సిన అంశాలపై సబ్ కమిటీ చర్చించింది. బీహెచ్ సిరీస్ పన్నుల అంశంపై చర్చించేందుకు దక్షిణాది రాష్ట్రాల రవాణా మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖకు సంబంధించి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ కార్యక్రమాల ద్వారా ఆదాయ సమీకరణను సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్అథారిటీ కమిషనర్ శశాంక, తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్-ఎండీ అనుదీప్ దురిశెట్టి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ ఇళాంభర్తి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వాణి ప్రసాద్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్ తదతరులు పాల్గొన్నారు.

# నిందితుల్ని వదిలిపెట్టం

మొదటి పేజీ తరువాయి...

యోగి ఆదిత్య నాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు.

అలాగే, ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపు తోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కరసేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందున్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందం టూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది. భక్తులు సమర్పించిన కానుకలు దేవాలయానికి చెందకుండా కొందరు సిబ్బంది కాజేశారని తేలింది. దీనిపై ప్రస్తుతం సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కొన్ని ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి.

### రైతాంగాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్

# భేషరతుగా క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి...

కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని రేవంత్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయా దాక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మరి మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా? అని నిలదీశారు. తడి గుడ్డతో రైతుల గొంతును ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాలు మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని ప్రభుత్వంలోని మంత్రులను ఆయన సూటిగా ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా? అని ప్రభుత్వ వైఖరిని ఆయన ఎండగట్టారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతావి ఎట్లా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయిందని ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదన్నారు. ఎకరాకు రూ. 15 వేలు అన్నారని చెప్పారు. 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని ఆయన పేర్కొన్నారు. రైతుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ. 29,358 కోట్లు బకాయి పడిందని ఆరోపించారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఈ సందర్భంగా ఆయన బల్ల గుద్ది మరీ ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా? అని మంత్రులకు హరీశ్ రావు సవాల్ విసిరారు.

మొత్తం రాష్ట్రంలో 7,600 మంది రైతులకు బీమా రాలేదని గణాంకాలతో సహా హరీశ్‌రావు వివరించారు. ఎందుకు బీమా రావడం లేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదని రైతులు చెప్పారన్నారు.

ఈ నేపథ్యంలో గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# క్షయ రహిత తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా కృషి

మొదటి పేజీ తరువాయి...

(ఎక్స్ రే, తెమడ పరీక్షలు) అనుమానితులం దరికీ నిర్వహించాలని కేంద్ర మంత్రి శ్రీ JP నడ్డా గారు ఈ కాన్ఫరెన్స్ లో తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను తెలంగాణ రాష్ట్రంలో 2492 గ్రామాలలో హెల్త్ స్క్రీనింగ్ లను నిర్వహిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స తో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి నెల ఒక వెయ్యి రూపాయలు నిక్షయ పోషణ యోజన పథకం కింద అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జీప నడ్డా గారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో పౌష్టికాహారం కోసం Food Basket లను బాధితులకు అందిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి రహిత తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా మాతృమరణాలను, నవజాత శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యం తో చర్యలు చేపట్టామన్నారు. RBSK బృందాల ద్వారా 0- 18 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కేంద్ర మంత్రి శ్రీ నడ్డా గారికి మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు వివరించారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను ముందే గుర్తించి గర్భిణీ స్త్రీలకు బర్త్ ప్లానింగ్ కోసం కావాల్సిన సదుపాయాలను అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచామని మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. రాష్ట్రం లో Anti Natal Checkup (ANP) లను విధిగా 4 సార్లు నిర్వహిస్తున్నామన్నారు. జన్యుపరమైన రుగ్మతలు (సికిల్ సెల్, తలసేమియా) ముందుగానే గుర్తించటానికి హెల్త్ చెక్ అప్ చేస్తున్నామని మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు వీడియో కాన్ఫరెన్స్ లో తెలియజేశారు. ప్రెగ్నెన్సీ సమయంలో వచ్చే హైపర్ టెన్షన్, డయాబెటిస్, థైరాయిడ్ లాంటి వాటిని గుర్తించటానికి హెల్త్ స్క్రీనింగ్, హెల్త్ చెక్ అప్, ట్రీట్మెంట్ చేస్తున్నామన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం) కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56 వ జన్మదినాన్ని పురస్కరించుకొని కొమిరెడ్డి లింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గతంలో అధికారం ఉన్న రాష్ట్రాలలో పేదల కోసం చేసిన పలు తీర్మానాలు సంస్కరణలను గుర్తు చేస్తూ కొనియాడారు. రాబోవు కాలానికి భారత దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేడిపల్లి గ్రామపంచాయతీ సభ్యులు బద్దం రాజారెడ్డి, ఎలుగందుల రాములుగుప్తా, జిల్లా రైతు నాయకులు పుడుకరపు గంగారెడ్డి, 12వ వార్డు మైనార్టీ నాయకులు జవీద్, రిటైర్డ్ ఎంపీడీవో ఇల్లెందుల, సుభాశ్, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి కుందేళ్ళ మురళి, 22వ వార్డు యూత్ ఇంచార్జ్ పిట్టల కుమార్, కాంగ్రెస్ నాయకులు 11వ వార్డు కళ్లెం నరేశ్, స్క్రాప్ వ్యాపారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ తోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు

### - ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు,భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని,గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి,అక్కడికి విచ్చేసిన నాయకులు,కార్యకర్తలు,ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విప్ చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలని కాపాడటమే ధ్యేయంగా అలుపెరగకుండా పోరాడుతున్న గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని,ఆయన గొంతు దేశ ప్రజల గొంతుకని కొనియాడారు.నిరుద్యోగులు,రైతులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని,భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలో ప్రేమను పంచిన గొప్ప మానవతావాది రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. ఆయన త్వరలోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి,దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆకాంక్షిస్తూ,ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు,కౌన్సిలర్లు,పలు గ్రామాల సర్పంచ్‌లు,పార్టీ ముఖ్య నాయకులు,యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### - ప్రభుత్వ విప్ విజయరమణ రావు
### - యోగా పోస్టర్‌ను విడుదల చేసిన ప్రభుత్వ విప్




జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) మానసిక ప్రశాంతతకు,శారీరక దృఢత్వానికి యోగా ఒక దివ్యౌషధమని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా ఆయుష్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన తన నివాసంలో ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా ఆయుష్ శాఖ అధికారులు ఎమ్మెల్యేను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో యోగా ప్రాముఖ్యత ఎంతో ఉందని,ప్రతి ఒక్కరూ నిత్యం యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.జూన్-21న ఉదయం 6 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న యోగా దినోత్సవ వేడుకల్లో జిల్లా ప్రజలు, యువత,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ డిపార్ట్‌మెంట్ అధికారులు డాక్టర్ అరుణ,కేశవ రెడ్డి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు ఆహ్వానం

గొల్లపల్లి జూన్ 19 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా" గాంధీ బాలికల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి పద్మ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేజీబీవీ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ సీఈసీ కోర్సును నూతనంగా ప్రారంభిస్తున్న నేపథ్యంలో కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)తో పాటు బి.ఎడ్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులను జతచేసి జూన్ 20 నుండి 22వ తేదీ వరకు ఆసక్తి గల అభ్యర్థులు గొల్లపల్లి కస్తూర్బా గాంధీ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు

## భూధార్ సర్వే..భూభారతి దరఖాస్తుల

# పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

### సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలి
### రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలి
### రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్




జగిత్యాల ప్రతినిధి జూన్ 19(ప్రజాకలం)

భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని,సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని,రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. జగిత్యాల కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి అర్హులైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో కొనసాగుతున్న నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏడి కిషన్ ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్,మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



### - జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి జూన్ 19 (ప్రజాకలం)

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని పురాతన పాఠశాలను సందర్శించి విద్యార్థుల మధ్యాహ్న భోజన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి పై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సక్రమంగా, సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెను, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ, కిచెన్ షెడ్ విధానాలపై ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సమానంగా, సమయానికి, సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతోనే ఆరోగ్యకరమైన సమాజం

### - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లా మనోహరరెడ్డి

పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఆధునిక వ్యవసాయంలో రసాయనాల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోవడం వల్ల మనిషి ఆరోగ్యం దెబ్బతింటోందని,రైతులు తక్షణమే సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లా మనోహరరెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం పెద్దపల్లిలోని నందనా గార్డెన్‌లో వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ శివంగారి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సేంద్రియ వ్యవసాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని గత పన్నెండేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ సురక్షితంగా,సుభిక్షంగా ఉంచుతున్నారని కొనియాడారు.వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సేంద్రియ సాగుకు పెద్దపీట వేస్తోందని,దీనిపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తోందని వెల్లడించారు.నిత్యం మనం తీసుకునే ఆహారం ద్వారా ఏదో ఒక రూపంలో రసాయనాలు మన శరీరంలోకి చేరుతున్నాయి.పంటల ఎదుగుదల కోసం వాడుతున్న పురుగుల మందులు,రసాయన ఎరువుల ప్రభావంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు



ప్రబలుతున్నాయి.ఈ ప్రమాదం నుండి సమాజాన్ని రక్షించాలంటే సాగు పద్ధతుల్లో మార్పు రావాలని నల్లా మనోహరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.తాను కూడా రైతునేనని, తన సొంత భూమిలో పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లోనే పంటలు పండిస్తున్నానని ఆయన పేర్కొనడం విశేషం.జిల్లాలో సేంద్రియ సాగు చేసే రైతులకు తనవంతు సహకారం అందిస్తానని భరోసానిచ్చారు.ఈ సందర్భంగా సేంద్రియ సాగులో విశేష కృషి చేస్తున్న ఆదర్శ రైతులను నల్లా మనోహరరెడ్డి ఘనంగా సన్మానించారు.సన్మానం అందుకున్న వారిలో ఎర్రం మల్లారెడ్డి, పెర్కపల్లి సుధాకర్,భూమయ్య,వర్కిల్ల మొఘిళి,కట్కూరి లావణ్య తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామగిరి అఖిల్,పెంజర్ల రాకేష్,మంథెన కృష్ణ,గనెబోయిన రాజేందర్,గుడ్ల సతీష్,అనిల్,మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో పెద్దపల్లి జిల్లాకు అరుదైన గుర్తింపు

### -గవర్నర్, సీఎం చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు విశిష్ట సన్మానం

పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా విద్యాశాఖ అధికారులకు విశిష్ట గౌరవం లభించింది.ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి.స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్,ముఖ్యమంత్రి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి,విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు ఈ గుర్తింపు లభించింది.వేలాది మంది విద్యార్థులు,ఉపాధ్యాయులు,విద్యాశాఖ సిబ్బంది సమక్షంలో ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యా రంగ భాగస్వాములు మరియు సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలియజేసింది.జిల్లా విద్యా రంగ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.



## ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

### – మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం)

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి తెలిపారు. శుక్రవారంనాడు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని, ప్లాస్టిక్ కవర్ల వల్ల రాబోయే తరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పట్టణంలోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలోనే తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ నిల్వలను క్లియర్ చేసుకునేందుకు జూలై 31వ తేదీ వరకు సమయం కావాలని వ్యాపారస్తులు కోరగా, అధికారులు ఇందుకు సానుకూలంగా స్పందించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరిస్తున్న ప్లాస్టిక్ రహిత మెట్‌పల్లి లక్ష్యంగా వ్యాపారస్తులు, ప్రజలు మున్సిపాలిటీకి పూర్తి సహకారం అందించాలని కోరారు. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత పట్టణంలో ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు ఉంటాయని వారు తెలిపారు.



## కళాశాలలో ముగిసిన ఏ ఐ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం)

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోజున కృత్రిమ మేధస్సు ఏ ఐ, డిజిటల్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేంకయ్య మాట్లాడుతూ కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్ గా పని చేస్తున్న ఎస్.సందీప్ ను కళాశాలకు ట్రైనర్ గా రావడం సంతోషకరమన్నారు. కళాశాల విద్యార్థులు, వివిధ పాఠశాలల్లో 30 గంటల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దాంతో విద్యార్థులకు నైపుణ్యాలు బాగా పెరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న,ఫ్యాకల్టీ కో- ఆర్డినేటర్ లు బిల్ల రాజేందర్,ఏ.మనోజ్ కుమార్ నాతో పాటు బోధన మరియు బోధనేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ సందీప్ ను ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది శాలువాతో సన్మానించి సత్కరించారు.

## భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం) డాక్టర్ బెజ్జల శ్రీనివాస్ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మెట్పల్లి పట్టణంలోని ప్రముఖ హాస్పిటల్ సాయి శ్రీనివాస్ హాస్పిటల్ లో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ భవిష్యత్తులో ఈ దేశానికి ప్రధానమంత్రి అయి తన సేవలను వినియోగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్మెంట్ అవుట్ల లక్ష్మణ్, డాక్టర్ రమేశ్, హాస్పిటల్స్ సిబ్బంది మనీషా, దీపిక తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు
### - గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో




ఎండపల్లి, జూన్ 19 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామ పంచాయతీ కార్యాలయం లో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైనా చెక్కులను గుల్లకోట కు చెందిన లబ్ధిదారులకు 1,88,000 రూపాయల చెక్కులను గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యం లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పోడేటి శ్రీకాంత్ 60.000, పులి లక్ష్మణ్ 57.500, భిసగొని అభిషేక్ 22.500, గొల్లపెల్లి మల్లవ్వ 22.500, పెంజర్ల కొమురమ్మ 13.500, లింగంపెల్లి మమత 12.000 మొత్తం 1.88.000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ అరిగేల జయవ్వ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు లబ్ధిదారులు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ తెలిపారు.

## బండలింగాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా పెరుమాండ్ల నారాయణ గౌడ్

మెట్ పల్లి రూరల్,జూన్ 19:(ప్రజా కలం):,మెట్ పల్లి మండలం బండలింగాపూర్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందున గౌడ సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గౌడ సంఘ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యక్షుడిగా బావు శేఖర్ గౌడ్, సభ్యులుగా కిషన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, లింగం గౌడ్, నరసయ్య గౌడ్, సామ దేవదాస్ గౌడ్, బావు కిషన్ గౌడ్, కిష్టయ్య లను ఎన్నుకున్నారు. వీరికి గౌడ సంఘ సభ్యులు మరియు గ్రామ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజా కలం

శనివారం, జూన్ 20, 2026

## ప్రాంతీయ పార్టీల పని అయిపోయిందా...

అప్పట్లో బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ ఉన్నప్పుడు చికెన్ నెక్ రహదారి విషయంలో అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వ్యక్తిగతంగా అమిత్ షా రిక్వెస్ట్ చేసినప్పటికీ మమత కరగలేదు. పైగా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల మీద ఉల్టా కేసులు పెట్టింది. బెంగాల్లో అడుగుపెట్టిన వారి మీద దాడి చేసింది. ఢిల్లీలో అప్పట్లో రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. గణతంత్ర దినోత్సవం రోజు ప్రధానమంత్రి జండా ఎగరవేసిన తర్వాత.. ఎర్రకోట మీద ఖలిస్తాన్ వేర్పాటు వాదులు జెండా ఎగరవేశారు. అప్పట్లో ఈ చర్యను ఆప్ ప్రభుత్వం సమర్ధించింది. అదే కాదు పంజాబ్ నుంచి.. హర్యానా నుంచి కొంతమంది ప్రతీప శక్తులు ఢిల్లీ రావడానికి కారణమైందిమహారాష్ట్రలో శివసేన అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ నాయకుల మీద విపరీతంగా కేసులు పెట్టారు. కొన్ని సందర్భాలలో వేరే శక్తులకు అవకాశం కల్పించారు. తద్వారా భారత ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. అంతేకాదు, మాఫియా శక్తులు బలపడేందుకు శివసేన కారణమైందని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి.ఇవన్నీ కూడా మోడీకి.. అమిత్ షా కు చికాకు కలిగించాయి. అందువల్లే ఈ దారుణాలకు ప్రాంతీయ పార్టీలు కారణమని వారు బలంగా నమ్మారు. పైగా దేశంలో జరుగుతున్న ఘోరాలకు.. అవాంఛనీయ సంఘటనలకు ప్రాంతీయ పార్టీలు దోహదం చేస్తున్నాయని వారిలో ఒక నమ్మకం ఏర్పడింది. ఇక అప్పటినుంచి వారు ఆపరేషన్ లోటస్ మొదలుపెట్టారు.కొన్ని సంవత్సరాల క్రితమే మహారాష్ట్రలో శివసేన పార్టీని నిలువునా చీల్చి పడేశారు మోడీ, షా. ఇప్పుడు ఏకంగా ఉ ద్ధవ్ వర్గంలో ఉన్న 9 మంది ఎమ్మెల్యేలలో ఆరుగురిని ఆకర్షించారు. కాకపోతే వారు నేరుగా బిజెపిలో చేరకుండా.. ఇతర పార్టీలో చేరబోతున్నారు. ఆ తర్వాత బీజేపీలోకి చేరడానికి ఆస్కారం కల్పిస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2024 ఎన్నికల్లో మహారాష్ట్రలో చెప్పుకునే స్థాయిలో బిజెపి పార్లమెంటు స్థానాలను గెలుచుకోలేకపోయింది. అందువల్లే తమకు ప్రతిబంధకంగా ఉన్న శివసేనను మరొకసారి చీల్చి పడేసే పనిని భుజాలకు ఎత్తుకున్నారు మోడీ, షా.పశ్చిమ బెంగాల్లో టిఎంసి పార్టీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ఇప్పుడు 20 మంది బయటకు వచ్చారు. వారంతా నేరుగా బిజెపిలో చేరలేదు. ఎన్ సి పి ఐ పార్టీలో చేరారు. వీరంతా దశలవారీగా మళ్లీ బిజెపి తీర్థం పుచ్చుకుంటారు. కేవలం ఎంపీలు మాత్రమే కాదు ఎమ్మెల్యేలు కూడా దాదాపు 58 మంది వేరే కుంపటి పెట్టారు. ప్రతిపక్షంగా తమనే గుర్తించాలని ఇప్పటికే స్పీకర్ కు లెటర్ రాశారు.మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ కంటే ముందుగానే ఆమ్ ఆద్మీ పార్టీలో కొంతమంది రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరారు. దీంతో ఎగువ సభలో బిజెపికి బలం పెరిగింది. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను చీల్చివేయడం.. రాజ్యసభ సభ్యులను.. పార్లమెంట్ సభ్యులను చేర్చుకోవడం ద్వారా బిజెపి గెట్టి ప్లాన్ వేసింది. ఇదంతా కూడా పార్లమెంట్లో 2/3 మెజారిటీ కోసం.. ఎందుకంటే ప్రస్తుత ఎన్డీఏ భుత్వం టిడిపి, నితీష్ కుమార్ సపోర్ట్ తో నడుస్తోంది. ఆర్జెడీ బీహార్ లో నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బిజెపి అభ్యర్థి ముఖ్యమంత్రి కొనసాగుతున్నారు.. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం బలంగా ఉంది.. ఇన్ని సానుకూలతలు కనిపిస్తున్న నేపథ్యంలో బిజెపి పెద్దలు వేసిన స్కెచ్ భారీగానే ఉంది.పార్లమెంట్లో బలం పెంచుకోవడం.. అప్పర్ హౌస్ లో మరింత స్ట్రాంగ్ గా ఉండడంతో కీలకమైన బిల్లులు ఆమోదింప చేసుకోవాలని మోడీ, షా భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు.. డిలిమిటేషన్.. ఇంకా చాలా బిల్లులు ఈ టర్ములోనే పూర్తి చేసుకొని.. 2027 లేదా 2028 ఎన్నికలకు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని మోడీ, షా భావిస్తున్నారు.. బీహార్ లో జేడీయు.. ఆంధ్రప్రదేశ్లో టిడిపి ఎన్డీఏ ప్రభుత్వానికి సపోర్ట్ ఇస్తున్నాయి. అలాంటప్పుడు ఆ పార్టీల కోరికలు తీర్చాల్సిన అవసరం లేకుండానే.. బిజెపి ఇలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను టార్గెట్ చేసి.. ఓడిస్తోందని.. ఆ పార్టీల ఎంపీలను కలిపేసుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆపరేషన్ లోటస్ రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. దీనిని ఆపే ప్రయత్నం గాని.. ఆపే సాహసం గాని ఎవరూ చేయడం లేదు. మరో వైపు ప్రాంతీయ పార్టీలకు ఒకే కుటుంబం ఆధిపత్యం వహిస్తుంది. పార్టీని వృద్ధిలోకి తీసుకురావడానికి ఎంతో కష్టపడిన సీనియర్ నాయకులను పక్కకు తప్పిస్తారు. ఇదే పార్టీలో అంతర్గత ఘర్షణలకు కారణమవుతుంది. చీలికలకు కారణమవుతుంది. పార్టీలోని యువతరం దీనిని సరిపెట్టుకోలేకపోతోంది. వంశపారంపర్య రాజకీయాలను యువతరం వ్యతిరేకిస్తోంది.అవినీతి ఆరోపణలు: ప్రాంతీయ పార్టీల్లో ప్రధానంగా కనిపించేది అవినీతి ఆరోపణలు. పార్టీ నాయకులు ఆరోపణలను ఎదుర్కోవడం, జైలుకు వెళ్లడం ఉమ్మడిగా కనిపించే అంశం. ఈ పార్టీల్లో అవినీతి తీవ్రమైన అంశమని చాలా మంది చెబుతూ ఉంటారు.నాయకత్వం అహంకారం: ప్రాంతీయ పార్టీల నాయకులు అహంకారాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. సెలబ్రిటీలు అహంకారంతో నెట్టుకొస్తారు. కానీ రాజకీయవేత్తలు ప్రజాబలంతో అధికారంలో కొనసాగుతారు. మద్దతుదారులకు దూరం అయినవారు అధికారానికి దూరం అవుతూ ఉంటారు. జరుగుతున్నది ఇదే.పరిపాలనలో పేలవత్వం: అనువంశిక పాలన మాత్రమే కాకుండా అవినీతి ఆరోపణలు ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తున్నాయి. అంతేకాకుండా సరైన పాలన లేకపోవడం కూడా ఒక కారణం. ఆర్థిక పరమైన బలహీన పరిస్థితి, కులాలు, ఇతర వర్గాలపై అతిగా ఆధారపడటం, మతపరమైన కారణాలు మొదలైన వాటివల్ల ప్రాంతీయ పార్టీలు క్షీణిస్తున్నాయి.నేర్చుకోవలసిన పాఠాలు: ఒడిశాకు 24 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన నవీన్ పట్నాయక్ చక్కని ఉదాహరణ. రాజకీయ అనువంశికంపై ఆయన ఆధారపడలేదు. ఆయన పాలనలో అవినీతి ఆరోపణలు ఎక్కువ రాలేదు. రాష్ట్రాన్ని ఆయన మంచిగా పరిపాలించారు. ప్రాంతీయ పార్టీల పతనానికి అవే కారణాలు. ఇతరులను నిందించడం ఎందుకు? ప్రాంతీయ పార్టీలను బీజేపీ మింగేస్తోందన్న ఆరోపణలు మీడియా చర్చల్లో తరచూ వస్తున్నాయి. కాంగ్రెస్ ఇతర పార్టీలను తమ పార్టీలో కలుపుకోవాలని చూస్తోందన్న అభిప్రాయం కూడా ఉంది. రాజకీయాల్లో పోటీ తత్వం పెరిగింది. ఓడిన వారి పట్ల సానుభూతి చూపరు. కొన్ని దేశాల్లో ఓడిన నాయకులు జైళ్లలో మగ్గడమో, నికృష్టమైన జీవనం గడపడమో చూస్తున్నాం. ప్రాంతీయ పార్టీల పతనానికి అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం ప్రధాన కారణాలు. ప్రాంతీయ పార్టీలు మారుతున్న వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే అవి నిలదొక్కుకోగలుగుతాయి. అలా చేయలేకపోతే అవి రాజకీయ యవనికపై నుంచి తెరమరుగు అవుతాయి. ఇతరులను నిందించడం ఎందుకు? మార్పులను ఆహ్వానించవల్సిందే, లేదా కాలగర్భంలో కలిసిపోవల్సిందే. ఎందుకంటే మోడీ, షా తలుచుకుంటే ఏం చేస్తారో వారికి తెలుసు.

## ఎరువుల కొరతకు తావు లేదు

### - రైతన్నకు అండగా. 20 వేల టన్నుల యూరియా సిద్ధం
### - ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

వానాకాలం సాగుకు సంబంధించి రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల మరియు జిల్లా వ్యవసాయ అధికారులతో వానాకాలం సీజన్ దృష్ట్యా ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో విప్ విజయర మణ రావు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్లో పంటల సాగు వివరాలు,యూరియా అవసరం,అందుబాటులో ఉన్న నిల్వలు మరియు కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.జిల్లాలో ప్రస్తుతం 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని,కాబట్టి రైతులకు ఎరువుల కొరత అనే సమస్యే ఉత్పన్నం కాదని,తగ్గుతున్న సాగుకు అనుగుణంగా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని భరోసానిచ్చారు.ఎస్సారెస్పీ ద్వారా సాగునీటిని సంవృద్ధిగా అందిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుత సీజన్లో ఎలినో ప్రభావంతో వరి పంట సాగు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని,దీనిని దృష్టిలో ఉంచుకుని జూలై మొదటి వారం లోపు పూర్తిస్థాయి పంట సాగు వివరాలను నివేదించాలని అధికారులకు సూచించారు.రైతులకు ఎరువుల కొరత అనే అంశానికి తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్న ఆయన,అధికారులందరూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రైతులకు సేవలు అందించాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి,వివిధ మండలాల వ్యవసాయ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సేవలే పోలీసుల లక్ష్యం కావాలి

### - పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి



పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులను కుటుంబ సభ్యులుగా భావించి,వారికి ఎంతో ఆత్మీయంగా, మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి సూచించారు.వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్ను డీసీపీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది డీసీపీకి స్వాగతం పలికారు. తనిఖీల్లో భాగంగా మొదట రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ,ఫిర్యాదులను స్వీకరించే విధానంపై సిబ్బందితో చర్చించారు. బాధితుల సమస్యలను ఓపికగా వినడమే కాకుండా, వారికి పూర్తి భరోసా కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.అనంతరం రికార్డులను పరిశీలించి,ఫిర్యాదు నమోదు నుండి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని,దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను నిర్దేశిత గడువులోగా న్యాయస్థానం ముందు హాజరుపరచాలని అధికారులను ఆదేశించారు.మహిళా కేసుల విచారణలో పారదర్శకతను పాటించాలని ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా కుటుంబ కలహాల కేసుల పరిష్కారానికి కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని,భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నట్లయితే చిన్న చిన్న సమస్యలకే విడిపోవడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని చెప్పారు.సర్దుకుపోవడమే సంసారానికి పునాది అని,కోర్టుల చుట్టూ తిరుగుతూ నష్టపోకుండా కౌన్సెలింగ్ ద్వారా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకునేలా వారిని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ,ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, మహిళా ఎస్ఐ రాజమణి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెంచు గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట

### పారుపల్లిలో చెంచులకు మెరుగైన వసతుల కల్పన -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,జూన్19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సంచార జీవులైన చెంచు కుటుంబాలకు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో చెంచుల నివాస గృహాలను,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను,ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను, ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా పారుపల్లి గ్రామంలోని సంచార జీవులైన 15 చెంచు కుటుంబాల వారికి అవసరమైన ఆధార్ కార్డులు,రేషన్ కార్డులు,అర్హులైన వారికి పెన్షన్లు ఇటీవల కలెక్టర్ చెరువతో అధికారులు అందించారు.పారుపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు,అర్హులైన చెంచు కుటుంబాలకు కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు.చెంచు కుటుంబాల కోసం ఇప్పటికే నిర్మించిన 10 గృహాలను పరిశీలించిన కలెక్టర్,వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు.పనులను వేగవంతం చేసి జూలై 31నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ధర్యాపూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్,పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని లెవెలింగ్ చేసి విద్యా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ముత్తారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి,ఎంపీడీవో సురేష్, ఏఈలు,డిఇలు,సంబంధిత శాఖల అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## బండలింగాపూర్ గ్రామంలో మన ఊరు- మన బడి కార్యక్రమం




మెట్ పల్లి రూరల్,జూన్ 19:(ప్రజా కలం):,ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపుదల లక్ష్యంగా నిర్వహిస్తున్న "మన ఊరు – మన బడి" కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ కనగందుల లక్ష్మీ సశీజీవ్ , ఉపసర్పంచ్ ఆకుల రాకేష్, గ్రామ పాలకవర్గ సభ్యులు బావు రవి , పాశం గట్టయ్య, పిట్ట నాగార్జున, మరియు మెట్పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగిటి రాజేందర్ మహిళా సంఘాల ప్రతినిధులు, హైస్కూల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి , జంగ గంగ స్వామి, ముదాం శివ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామంలోని ప్రతి చిన్నారి విద్యాభ్యాసం పొందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదం లో ఒకరికి గాయాలు...

మల్లాపూర్, జూన్ 19 ( ప్రజా కలం ప్రతినిధి) : మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో ఒక యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, షేక్ ఖాసిం (19) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే మెట్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బస్




ను పోలీసు స్టేషన్ కు తరలించినట్టు సమాచారం. పూర్తి వివరాలు పోలీసులు తెలుపాల్సి ఉంది.

## స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

### - ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన స్వర్ణకార సంఘం ప్రతినిధులు



పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్దపల్లి పట్టణ వెండి బంగారు వర్తక సంఘం మరియు స్వర్ణకార సంఘం నాయకులు శుక్రవారం పెద్దపల్లి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి,ప్రధాన కార్యదర్శి చేవూరి వెంకటస్వామిల పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు,వ్యాపారుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు.స్వర్ణకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానికి పాలకమండలిని నియమించాలని డిమాండ్ చేశారు.అలాగే, జీవో నంబర్ 272ను సవరించి,పటిష్టంగా అమలు చేయడం ద్వారా దొంగ బంగారం రికవరీ ఆరోపణల నుండి అమాయక స్వర్ణకారులకు రక్షణ కల్పించాలని కోరారు.గీత,నేత కార్మికులకు ఇస్తున్న తరహాలోనే 50 ఏళ్లు నిండిన స్వర్ణకార వృత్తిదారులకు నెలకు రూ.5వేల పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఇరు సంఘాల అధ్యక్షులు రంగు శ్రీనివాస్,కట్ట రమేష్,ప్రధాన కార్యదర్శి దేవరకొండ రాజు,కట్ట సతీష్,రాష్ట్ర కార్యదర్శి మడుపు రాంనర్సయ్య,ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి కందుకూరి పూర్ణచారి,ఇతర రాష్ట్ర మరియు జిల్లా స్థాయి నాయకులతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి బాట

### - ఉపాధి అవకాశాల కల్పన జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్

పెద్దపల్లి,జూన్ 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)



జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిని అందించి,ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్,డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ మరియు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు,ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు.10వ తరగతి,ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 22, ఉదయం 10:00 గంటలకు పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ బస్ డిపో ప్రాంగణం పక్కన ఉన్న టాస్క్ ప్రాంతీయ కేంద్రానికి హాజరు కావాలని,మరిన్ని వివరాల కోసం 9154909057, 9959892960 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి తన ప్రకటనలో సూచించారు.

## అత్యవసర సమయంలో రక్తదానం



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం) పట్టణంలోని శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోరుట్ల పట్టణానికి చెందిన మహిళకు రక్తస్రావం అవుతూ ఉండగా అత్యవసరంగా తనకు సర్జరీ చెయ్యాలని, సర్జరీ నిమిత్తం ఎబి పాజిటివ్ రక్తం అవసరం అని డాక్టర్ చెప్పడంతో సమయం రాత్రి 3 గంటలకు రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్, మెట్పల్లి మున్సిపల్ 21వ వార్డు కౌన్సిలర్ ఖాజా అజీమోద్దీన్ ని సంప్రదించగా ఆ రాత్రి వెంటనే హాస్పిటల్ కి వెళ్లి డాక్టర్ తో మాట్లాడి సామాజిక సేవకుడు, శాశ్వత రక్తదాత పుల్లూరి వేణు కి ఫోన్ చేసి సమాచారం తెలుపగ వేణు వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వచ్చి రక్తం అందించారు. సమయంతో సంబంధం లేకుండా అత్యవసర సమయంలో సేవలు అందించిన రాద్య బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి, ఫోన్ చేసిన వెంటనే నిద్రలో నుండి లేచి వచ్చి రక్తదానం చేసిన వేణు కు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన పుల్లూరి వేణు ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, శ్రీనివాస మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ డాక్టర్ రవి 21వ వార్డు కౌన్సిలర్ ఖాజా అజీమోద్దీన్, రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్, సామాజిక సేవకుడు ఫసియోద్దీన్, పేషెంట్ బంధువులు తదితరులు అభినందించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

గొల్లపల్లి జూన్ 19 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామంలో మంత్రి అడ్లూరి శుక్రవారం పర్యటించారు.గ్రామంలోనీ రేవేళ్ల లావణ్య శ్రీధర్ దంపతులకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల స్వంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.అనంతరం గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకరగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీఏసీ ఎస్ చైర్మెన్ భీమా సంతోష్, పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న,పురపాటి రాజి రెడ్డి, ముస్కూ నిశాంత్ రెడ్డి,సర్పంచులు మ్యాక స్వామి,కోట అశోక్, ఆకుల సుమన్ గౌడ్, రెవెల్ల సత్యనారాయణ గౌడ్,జెల్ల అనిల్,కేతిరెడ్డి భూమారెడ్డి, మూస్కూ రాంరెడ్డి, కోట శేఖర్, గౌతమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పారిశుద్ధ్య నిర్వహణపై సదస్సు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం) రాబోయే వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణ కొరకు ముందస్తు కార్యాచరణను అమలు చేసేందుకు మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో, కో ఆప్షన్ సభ్యులు, ఆశా వర్కర్స్, అంగన్వాడీలు, వార్డ్ ఆఫీసర్స్, శానిటేషన్ సెక్షన్ సిబ్బందికి సదస్సు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో లింబాద్రి మాట్లాడుతూ వర్షాకాలం పట్టణంలోని అన్ని మెయిన్ డ్రైనేజీలను శుభ్రపరచాలని డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు రాకుండా టేమోపాస్ మలాథిన్ స్ప్రే చేయించాలన్నారు. మురికి కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సాయంత్రం పూట ఫాగింగ్ చేయించాలని వెల్లడించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ 2026 సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం వార్డులలో చెత్త ఎలా స్వీకరించాలో అవగాహన కల్పిస్తూ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, డిస్టిక్ కమిటీ మెంబర్ మణికంఠ, డాక్టర్ వాణి అంజిత్ రెడ్డి, కౌన్సిలర్లు కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ స్టాప్ వార్డ్ ఆఫీసర్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## బదిలీ పై వెళ్తున్న అధికారులకు ఆత్మీయ సన్మానం..



మల్లాపూర్, జూన్ 19: ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండలంలో సాధారణ బదిలీలలో భాగంగా మండలం నుంచి బదిలీ అయిన పలువురు అధికారులకు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో, ఎంపీవోలతో పాటు కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు స్వాగతం పలికారు. అలాగే మండలం నుంచి బదిలీ అయిన ఎంపీవోతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. బదిలీ అయిన అధికారులు మాట్లాడుతూ మల్లాపూర్ మండలంతో తమకు ఏర్పడిన అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఒక ప్రాంతాన్ని విడిచి వెళ్లడం బాధాకరమైనప్పటికీ, ప్రభుత్వ విధుల్లో భాగంగా బదిలీలు సహజమని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, మాజీ ఎంపీవో జగదీష్, మల్లాపూర్ సర్పంచ్ లక్ష్మణ్, రాఘవపేట సర్పంచ్ శ్రీనివాస్, మండల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గోశాలలో వృద్ధుడి హత్య

కృష్ణా జిల్లా : కంకిపాడు మండలం గోశాల గ్రామంలో ఒక స్థలం వివాదంలో మామను అల్లుడు హత్య చేసాడు. అల్లుడు మామ ఛాతి పై దాడి చేసాడు. ఘటనలో గోశాల కు చెందిన ఉప్పల సాంబశివరావు(65) ఘటనా స్థలంలోని మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## త్వరలో పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పూర్తి

### - బద్వేల్ ఏఎంసి నారిసెట్టి సుప్రజ

పోరుమామిళ్ల వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా కీలక సమావేశం జరిగింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన సమస్యలు, పోరుమామిళ్లలో రైతు బజార్ ఏర్పాటు, బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే అంశాలపై చర్చించారు. అలాగే నిర్మాణంలో ఉన్న పోరుమామిళ్ల ఉపమార్కెట్ యార్డ్‌ను త్వరలోపూర్తి చేసి రైతులకుఅందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయ వనరులను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## సాయి కృష్ణ మాయమైన కేసులో
## సిఐ నాగరాజును పదవి నుంచి తొలగించాలి

మచిలీపట్నం : వి జయవాడకు చెందిన కాపుసేన సభ్యుడు సాయి కృష్ణ తెరమడుగు అవడానికి కారణమైన సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజును సి.ఐ పదవి నుంచి శాశ్వతంగా తొలగించి నాగరాజు కుటుంబానికి 5 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర కాపు సేన లీగల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు బుధవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కాపు కులముకు చెందిన యువకుడు మరణానికి సంబంధించి కాపు ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని బాలాజీ కోరారు. చట్ట వ్యతిరేకంగా రాష్ట్ర నడిబొడ్డిలో జరిగిన నాగరాజు అదృశ్యం రాష్ట్ర ప్రభుత్వానికి తలంపులు తీసుకొచ్చిందని బాలాజీ అన్నారు. రాష్ట్ర డిజిపి ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన సీఐ నాగరాజును విఆర్‌ఓ పంపటం సరైన చర్య కాదని బాలాజీ అన్నారు. తక్షణమే నాగరాజుపై హత్య నేరం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు విలేకరులకు చూపించిన ఫోటోలు చూస్తే నాగరాజు మరణం లాక్ అప్ అప్ డెత్ గా కనిపిస్తుందని బాలాజీ అన్నారు. రాష్ట్ర హైకోర్టు సూచన ప్రకారం నాగరాజు నుహై కోర్టు ఎదుట ప్రవేశపెట్టవలసి ఉండగా అందుకు భిన్నంగా కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదని బాలాజీ అన్నారు. రౌడీషీటర్లను కాల్చివేయమని ఏ చట్టం, ఏ పోలీసు మాన్యువల్ చెప్పలేదని బాలాజీ అన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## –కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన సరిత తిరుపతయ్య

ప్రజా కలం (గద్వాల ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ యువతకు, ప్రజలకు స్ఫూర్తిదాయక నాయకుడు, ప్రజాస్వామ్య పరిరక్షకుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సరిత పార్టీ కార్యాలయం నందు శుక్రవారం జన్మదిన వేడుకలలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల సహకార సమాఖ్య చైర్‌పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ సరిత తిరుపతయ్య అధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరితమ్మ మాట్లాడుతూ దేశ యువతకు ఉపాధి, అవకాశాల కల్పనే రాహుల్ గాంధీ ప్రధాన లక్ష్యమని అన్నారు. యువతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దేశంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడని ఆమె అన్నారు. ఉద్యోగ నియామక పరీక్షలలో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది యువత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఉద్యోగాలు రావాలంటే విధానాల్లో మార్పు రావాలి" అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, యువత సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చే భారతదేశ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. భగవంతుని



ఆశీర్వాదంతో రాహుల్ గాంధీ మరింత ప్రజాసేవ చేసేందుకు బావి భారత ప్రధానమంత్రి కావాలని సరిత తిరుపతయ్య తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కొద్దిమంది పెత్తందారులను ప్రోత్సహించే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. సాధారణ ప్రజలు, రైతులు, యువత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని కోరుతూ పార్టీ శ్రేణులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోడిసిసి జనరల్ సెక్రటరీ శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లత్తిపురం వెంకట్రామిరెడ్డి, మధుసూదన్ బాబు, అల్వాల రాజశేఖర్ రెడ్డి, డి.ఆర్.శ్రీధర్, ఎల్లప్ప, సర్పంచ్ నిత్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ సీసాల వెంకట్ రెడ్డి, సద్దల్లోనిపల్లి గోపాల్, పాతపాలెం ఆనంద్ గౌడ్, పటేల్ శ్రీనివాసులు, అచ్చన్న గౌడ్, కృష్ణయ్య గౌడ్, సతీష్ యాదవ్, తిమోతి, రాజారెడ్డి, తిమ్మప్ప, కాంగ్రెస్ పార్టీనాయ కులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్లకు నూతన పరికరాలను అందజేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నిర్మల్ జూన్19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా పోలీసు శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేయడం, ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈరోజు నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు నూతన సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అందజేశారు.


ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు బార్‌కోడ్ స్కానర్లు, లేబుల్ ప్రింటర్లు, సింగిల్ డిజిట్ స్కానర్లు, ఫింగర్ ప్రింట్ బ్యూరో సిస్టమ్స్, ఫింగర్ ప్రింట్ స్కానర్లు, ప్రింటర్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో కేసుల సంఖ్య పెరగడం, కంప్యూటర్లు, ట్యాబ్‌ల సాంకేతిక సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా కోర్టు కేసుల వివరాలను వేగవంతంగా నమోదు చేయడం, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు సమన్వయ అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా న్యాయ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీటి సహకారం అందనుంది.

**పరికరాల ప్రాధాన్యత**

వేలిముద్ర (ఫింగర్ ప్రింట్) స్కానర్లు: వ్యక్తుల గుర్తింపును ధృవీకరించడం, నేర చరిత్రను గుర్తించడం, అనుమానితుల వివరాలను తక్షణమే సేకరించడం మరియు పెండింగ్ కేసుల ఛేదనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

సింగిల్ డిజిట్ స్కానర్లు: పోర్టబుల్ బయోమెట్రిక్ పరికరాలైన ఇవి వ్యక్తుల గుర్తింపును క్షణాల్లో ధృవీకరించడంతో పాటు కేంద్రీకృత డేటాబేస్‌లతో సరిపోల్చి నేర చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.

బార్‌కోడ్ స్కానర్లు: ముద్రించిన బార్‌కోడ్‌లను డిజిటల్



సమాచారంగా మార్చి రికార్డుల నిర్వహణ, సాక్ష్యాల ట్రాకింగ్ మరియు ఇతర పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేస్తాయి.

లేబుల్ ప్రింటర్లు: కేసు ఫైళ్లు, సాక్ష్యాధారాలు మరియు ఇతర రికార్డులను ఖచ్చితంగా గుర్తించి నిర్వహించడంలో కీలకంగా ఉపయోగపడతాయి. తెలంగాణ పోలీస్ శాఖలో సాక్ష్యాల భద్రత, రికార్డుల నిర్వహణలో ఇవి ముఖ్యమైన సాధనాలుగా పని చేయనున్నాయి. జిల్లా పోలీస్ శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేసి, ప్రజలకు వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పరికరాలను అందజేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తో పాటు ఏఓ యూనస్ అలీ, ఇన్స్పెక్టర్లు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, ఆర్.ఐ (అడ్మిన్) రామ్ నిరంజన్ రావ్, ఎస్సైలు జీ.లింబాద్రి, శ్రీకాంత్, రవీందర్, గణేష్, గోపి, శ్రావణి, హన్మండ్లు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి తరం యువతకు ఆదర్శప్రాయం రాహుల్ గాంధీ

## గద్వాల లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజా కలం గద్వాల ప్రతినిధి:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మేకల సహకార సమాఖ్య చైర్పర్సన్ సరిత తిరుపతయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి విలువల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అంకితభావం ప్రశంసనీయమని అన్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎన్నో సవాళ్లు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రాహుల్ గాంధీ ధైర్యంగా నిలబడుతున్నారని కొనియాడారు. దేశం కోసం అసాధారణ త్యాగాలు చేసిన కుటుంబ వారసత్వాన్ని వినయంతో, నిబద్ధతతో ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు.

భారతదేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించే ఆదర్శ నాయకుడిగా రాహుల్ గాంధీ ఎదిగారని సరిత అన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యం, ఆనందం, అపార శక్తి కలగాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మధుసూదన్ బాబు, అల్వాల రాజశేఖర్ రెడ్డి, ఆర్ శ్రీధర్, ఎల్లప్ప, సద్ద లోని పల్లి గోపాల్, ఆనంద్ గౌడ్, పటేల్ శ్రీనివాసులు, అచ్చన్న గౌడు, కృష్ణయ్య గౌడ్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సహదేవుడు కు సన్మానం

### - బేడ బుడగ జంగాల నాయకులు

ప్రజా కలం గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల్ పట్టణంలో బి జె హెచ్ పి ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు సిరిగిరి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర టిపిసిసి ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై మొట్టమొదటిసారిగా గద్వాల జిల్లాకు వచ్చిన శుభ సందర్భంగా ఆయనకు బేడ బుడగ జంగం హక్కుల



పోరాట సమితి నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ బిజె హెచ్ పి ఎస్ అధ్యక్షులు సిరిగిరి కృష్ణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర బెడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి, రాష్ట్ర టిపిసిసి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సహదేవుడు సంతోషమన్నారు. రాష్ట్రంలో ఇలాంటి గొప్ప గొప్ప పదవులు చేపట్టాలని ఇంకా రాబోయే కాలంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా నామినేట్ పోస్టులో మన జాతి బిడ్డలు ఎదగాలని ఆకాంక్షించారు. అసెంబ్లీలో మన వాయిస్ వినిపించాలని, రాష్ట్రం నలువైపులా ప్రతి ఒక్క బేడ బుడగ జంగాలని కలుపుకొని ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణం సోమయ్య, నాగేశ్, సవారి, పరుశురాం, రాజు, పెద్ద బిసి, శ్రీరామ్, శీను, వెంకటేష్, కృష్ణ, గోపాల్, రాజు, శీను, బాలా మది, ఘనుడు తదితరులు పాల్గొన్నారు.

## భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### - రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్

నిర్మల్ జూన్ 19(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భూధార్ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన



ఆయన, జిల్లాల్లో భూధార్ సర్వే చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సర్వేయర్లను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, అలాగే భూభారతి దరఖాస్తులను నిర్ణీత 60 రోజుల గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, భూధార్ సర్వే నిర్వహణకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, సాదాబైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోల్సాలో స్కూల్ ప్రహరీ గోడ, గేట్ ప్రారంభం



తానూర్, జూన్ 19(ప్రజా కలం ):

మండలం బోల్సా గ్రామంలో లక్షల నిధులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయింది. శుక్రవారం నూతన గేట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి దీనిని ప్రారంభించారు, ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ సుదర్శన్, ప్రధానోపాధ్యాయులు దత్తాత్రి, ఉపాధ్యాయులు వినోద్, శ్రేష్ఠ, వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, పాఠశాల రక్షణకు ఈ గోడ ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## తానూర్ మండలంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### – పిహెచ్‌సి, కేజీబీవీ పాఠశాల, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

తానూర్, జూన్ 19(ప్రజా కలం): మండల కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, ఇందులో భాగంగా ముందుగా ఆయన మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, దవాఖానా రికార్డులను తనిఖీ చేశారు, రోగులకు అందుతున వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆదేశించారు, అక్కడే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు, అనంతరం స్థానిక నర్సరీని సందర్శించి అక్కడ పెరుగుతున్న మొక్కల స్థితిగతులను పరిశీలించారు, అక్కడి నుండి కేజీబీవీ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్, విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్లాంకెట్లను పంపిణీ చేశారు, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్యాంపస్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు, ఈ తనిఖీ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్‌తో పాటు ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓ నరేందర్, హౌసింగ్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేయాలి

## – రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




ఖమ్మం, జూన్ 19( ప్రజా కలం న్యూస్ ) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ ఆర్ ఓ లతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, ఫారం పూర్తి చేసిన తర్వాత తిరిగి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ముఖ్యపాత్ర పోషిస్తారని, పట్టణాలలో మ్యాపింగ్, అన్ మ్యాపింగ్ విభాగాలుగా సమాచారాన్ని విభజించి సవరణ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు సమావేశాలు నిర్వహించి సంబంధిత ఫోటోలు, మీటింగ్ మినిట్స్ నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు స్థానిక భాషలో ముద్రించబడతాయని, బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు అందజేయబడిన ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఈ ఆర్ ఓ లు క్షేత్రస్థాయిలో తరచుగా పర్యటించి సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించాలని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని, మ్యాపింగ్ చేయబడని ఓటర్ల వివరాలను అప్డేట్ ఆప్షన్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. జూలై 24వ తేదీ లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం జరుగుతుందని, జూలై 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని, జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, జూలై 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాల పరిష్కరణ, అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, మీటింగ్ మినిట్స్ నమోదు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మందికి మించి ఓటర్లు ఉ ఒడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని, బూత్ స్థాయి అధికారులకు వృద్ధ, అనారోగ్య, దివ్యాంగ ఓటర్ల నమోదు విషయంపై ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు. ఒకే కుటుంబం సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేకహాహాసమగ్ర సవరణ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. బూత్ స్థాయి అధికారులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై జిల్లాలో బ్యానర్లు, హోర్డింగ్ల ద్వారా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు ప్రచార సామాగ్రి, బూత్ స్థాయి అధికారుల కిట్లు చేరినట్లు అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల పూర్తి, ఏ ఏ ధృవీకరణలు తీసుకోవాలో బూత్ స్థాయి అధికారులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం ఏ. రాజు, డిటి అన్సారీ, ఎన్నికల విభాగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

## – ప్రతి ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించాలి

– ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి

– డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి

– రఘునాథపాలెం మండలం కేంద్రంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం, జూన్ 19(ప్రజా కలం న్యూస్ )

ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కు ప్రజలందరూ తమ పూర్తి వివరాలతో స్వచ్ఛందంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.

శుక్రవారం ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నారన్నారు. డబుల్ ఓట్లు, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యం, ఎన్నికల సిబ్బంది విధులు, పౌరుల భాగస్వామ్యం, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన పెంచడం ద్వారా ప్రతి అర్హ పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి సహకరించాలని అధికారులు కృషి చేయాలన్నారు.

బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.



ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ అన్నారు. వివరాలు, కావాల్సిన ధృవీకరణలు బూత్ స్థాయి అధికారి సందర్శన సందర్భంగా సిద్ధం గా ఉంచాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలందరూ సంపూర్ణంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి లో విత్తన, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, పోలీసుల తనిఖీలు



పాలేరు జూన్ 19( ప్రజా కలం న్యూస్ )

రైతులను మోసం చేసే నకిలీ విత్తన మాఫియాపై చర్యలు తీసుకునేందుకు శుక్రవారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఉమ్మడిగా కూసుమంచి లోని పలు విత్తన, ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కూసుమంచి సిఐ సంజీవ్, వ్యవసాయ శాఖ ఏవో వాణి , ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.

రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తనిఖీ చేశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు.

రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# 'దేశ భవితకు దిక్సూచి రాహుల్ గాంధీ'

## – భావి భారత ప్రధానిగా చూడడమే ప్రజల ఆకాంక్ష

## – మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు



ఖమ్మం జూన్ 19(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ భవితకు దిక్సూచి అని, ఆయనను భావి భారత ప్రధానిగా చూడడమే యావత్ దేశ ప్రజల ఆకాంక్ష అని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. తుంబూరు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ త్వరలోనే ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాపక్షపాతి అయిన ఆయన నాయకత్వంలో దేశం మరింత ప్రగతి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, పార్టీ ముఖ్య నాయకులు మద్ది వీరారెడ్డి, వెంకట్‌కృష్ణ, ఉమ్మినేని కృష్ణ, షేక్ ఇమామ్, రంజిత్ నాయక్, రవి, పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్స్ ఆరెంపుల బద్రిసాయి, బొడ్డు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## – ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పోరాడుతున్న గొప్ప నేత అని కొనియాడిన ఎంపీ రఘురాం రెడ్డి – పార్టీ శ్రేణుల నడుమ కేక్ కటింగ్

ఖమ్మం జూన్ 19(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఖమ్మం లోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు రాహుల్ గాంధీ నిబద్ధతతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రధానిగా చూడాలనేది ప్రజల ఆకాంక్ష అని, భవిష్యత్తులో ఇది సాకారం అవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,



సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ చౌదరి, సీనియర్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ప్రతిభా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, నాయకులు కిరణ్ నాయక్, మేడా వెంకట్రావ్, క్రాంతి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీ పాఠశాలలో అక్షరాభ్యాసం ఉచిత పుస్తకాల పంపిణీ...




మల్హర్, జూన్ 19 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచర్ల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను గ్రామ సర్పంచ్ బండి స్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత, నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. తల్లిదండ్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఘనంగా ఎన్నిక

## - భద్రాచలాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జూన్ 19:

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ 14వ నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకుంది. సంస్థ అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారిగా ఉ ప్పాడ రాంప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ కృష్ణ ప్రసాద్, వీరయ్య, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా లక్ష్మీ సావిత్రి, పీఆర్‌ఓగా సంపత్, లీగల్ అడ్వైజర్‌గా రామరాజు తిరుమలరావు నియమితులయ్యారు. హార్టికల్చర్ అడ్వైజర్లుగా లయన్స్ డాక్టర్ గొల్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణ (పార్క్ కృష్ణ) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర, పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ, పాకాల దుర్గాప్రసాద్, భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్, పల్లంటి దేశప్ప, క్వెస్ట్ రాజారెడ్డి, చిట్టి లలిత, డాక్టర్ గొల్ల భూపతిరావు, ఉమాశంకర్ నాయుడు, పార్క్ కృష్ణార్జునరావు, బొలిశెట్టి రంగారావు, చింతిరియాల రవికుమార్, పరమి సోమశేఖర్, సోమరుసు శ్రీనివాసరావు, జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పుణ్యక్షేత్రం మాత్రమే కాకుండా పచ్చదనానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. యువ నాయకత్వంతో ఏర్పడిన గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం భద్రాచలాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దాలని సూచించారు. పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజ సేవతో పాటు పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా



వాటిని సంరక్షించడం ద్వారా నిజమైన పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్ మాట్లాడుతూ భద్రాచలం వంటి పవిత్ర క్షేత్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం నూతన అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శి భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 2026-27 సంవత్సరాన్ని భద్రాచలం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకునే విధంగా భారీ ఎత్తున వృక్షారోపణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజల సహకారంతో వేలాది మొక్కలు నాటి భద్రాచలాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి పుణ్యక్షేత్రంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, అలాంటి పవిత్ర క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే మహోన్నత వృక్షారోపణ కార్యక్రమాలను విజయవంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని నూతన కార్యవర్గం పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రీన్ భద్రాద్రిని ప్రజలకు మరింత చేరువ చేస్తామని సభ్యులు తెలిపారు.

# బెంగళూరు పాత హైవేలో రోడ్డు ప్రమాదం

**- నందిగామ మండల పరిధిలో ఘటన**
**- లారీని వెనకాల నుండి బైక్ తో ఢీకొన్న యువకుడు**
**- అంతిరెడ్డి గూడ గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు**
**- విషాదంలో కుటుంబ సభ్యులు**



(నందిగామ జూన్ 19 ప్రజా కలం ప్రతినిధి) నందిగామ మండల కేంద్రంలో చెంద్రని గూడ గ్రామ సమీపంలోని బెంగళూరు పాత జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ముందుగా వెళుతున్న లారీని వెనకనుండి బైక్ తో ఢీకొట్టిన సంఘటనలో యువకుడికి తీవ్రంగా తలకు గాయాలు తగలటం వల్ల స్పృహ కోల్పోయిన క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నందిగామ మండలం పరిదిలోని అంతిరెడ్డి గూడ గ్రామానికి చెందిన సిరివాటి చరణ్ షాద్నగర్ పట్టణంలోని పూల దుకాణంలో విధులు నిర్వహిస్తాడు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై షాద్నగర్ వెళుతుండగా నందిగామ సమీపంలో బెంగళూరు పాత జాతీయ రహదారిపై ముందుగా వెళుతున్న లారీని వెనకాల నుండి బైక్ తో ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి ఈ ప్రమాదంలో యువకుడి చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అత్యవసర చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. యువకుడు మృతితో కుటుంబ సభ్యుల రోధనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# విద్యుత్ జె ఎల్ ఎమ్ నిర్లక్ష్యం
# షాక్ కి గురై యువరైతు మృతి

**- ఎల్‌సీ ఇవ్వకుండానే పని చేసుకోమన్నాడని ఆరోపణలు**
**- జేఎల్ఎంను సస్పెండ్ చేయాలని బంధువుల డిమాండ్**



జూన్ 19 ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ పరిధిలోని భవానికుంట తండాలో విద్యుత్ షాక్‌తో ఓ యువరైతు మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. భవానికుంట తండాకు చెందిన యువరైతు బానోతు గణేష్ వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలం వద్ద ఉన్న బావికి వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటాన్ని గమనించిన గణేష్, సంబంధిత జేఎల్ఎంకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. విద్యుత్ సరఫరా నిలిపివేసి (ఎల్‌సీ) పనులు నిర్వహించుకోవచ్చని జేఎల్ఎం చెప్పడంతో గణేష్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి వైర్లను సరిచేసే ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే, విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా ఉండటంతో గణేష్‌కు ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి ట్రాన్స్‌ఫార్మర్‌పైనే కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన సమీప రైతులు వెంటనే అక్కడికి చేరుకుని సీపీఆర్ నిర్వహించి, అనంతరం వర్ధన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే గణేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధిత జేఎల్ఎం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆయనను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రైమరీ స్కూల్ లో సర్పంచ్ కొండ రాజమ్మ విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ



మల్హర్, జూన్ 19 ప్రజాకలం ప్రతినిధి : మండలంలోని కొయ్యూరు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలు, కొయ్యురు సర్పంచ్ కొండ రాజమ్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు వేల్పుల మహేందర్, యూత్ ఉపాధ్యక్షుడు అశోక్, పెరమండ్ల మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ మమత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయురాలు శాంతిలత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలిక మృతి ఘటనలో వైద్యుడి సస్పెండ్

ప్రజా కలం (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి ఇటీవల అపెండిసైటిస్ తో బాధపడుతూ చికిత్స నిమిత్తం వచ్చిన ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని ఇందు (17) వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వతంత్ర విచారణ కమిటీని నియమించారు. విచారణ చేసిన కమిటీ సభ్యులు నివేదికను ఈ నెల 13న కలెక్టర్ కు సమర్పించగా రీ



ఎంక్వయిరీకై మెడికల్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ కు పంపించడం జరిగింది. డైరెక్టర్ విచారణ అనంతరం వచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని బాలిక మృతి ఘటనకు కాంట్రాక్ట్ బేసిక్ లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ సర్జన్ డాక్టర్ మాలిమ్ అర్షద్ ను బాధ్యుడిగా నిర్ధారించి విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా జి. అశోక్ బాధ్యతల స్వీకారం

**ప్రజలకు మెరుగైన పౌర సేవలే లక్ష్యం - పారదర్శక పాలనకు కట్టుబాటు**

జూన్ 19 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)



వర్ధన్నపేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా జి. అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టగా, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జి. అశోక్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయడంతో పాటు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

# విద్యార్థులకు కృత్రిమ మేధస్సు దిశగా అడుగులు

**- వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ శిక్షణ.**
**- డిజిటల్ లెర్నింగ్‌పై రెండు రోజుల శిక్షణ ప్రారంభం.**

జూన్ 19 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) ప్రభుత్వ డిగ్రీ కళాశాల వర్ధన్నపేటలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అన్న-అక్క మెంటర్‌షిప్ ప్రోగ్రాం"లో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరియు డిజిటల్ లెర్నింగ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోశయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అకాడమిక్ విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక రంగంలో శిక్షణ పొందడం ద్వారా భవిష్యత్ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ, ఈ శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు వారి డిగ్రీ మెమోలో అదనంగా ఒక క్రెడిట్ మంజూరు చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమ నోడల్ అధికారులు



డాక్టర్ సీహెచ్ స్నేహలత రెడ్డి, డాక్టర్ నేరెళ్ల శ్రీనివాస్, డాక్టర్ జి. రజితలు మాట్లాడుతూ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలు, అవసరాన్ని వివరించి శిక్షణ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. శిక్షణ మాస్టర్ ట్రైనర్‌గా వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి జి. కల్యాణి విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ లెర్నింగ్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ-విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**- కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు**



జూన్ 19 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) భారత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 57వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొడగని రాజేష్ ఖన్నా, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, కో-ఆప్షన్ చైర్మన్ ఈగ దామోదర్, అంబేద్కర్ నగర్ సర్పంచ్ చిటూరి రాజు, చెన్నారం సర్పంచ్ సింధం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, తిరుపెల్లి వాణి కుమారస్వామి, ఎస్సీ సెల్ మండల నాయకులు మరుపట్ల సాయికుమార్, గుంటి కుమారస్వామి, లింగం రజిత రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎర్ర శ్రీకాంత్, ఎలసారపు వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐత యాకంతం, హన్మకొండ సుధాకర్, ఐత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



వలిగొండ జూన్ 19 ప్రజాకలం:వలిగొండ మండల కేంద్రంలోనీ ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రజలను ఏకం చేయడం వారి సమస్యలను వినడం లక్ష్యంగా,భారత్ జూడో యాత్రను చేపట్టాడు భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా 2002 సెప్టెంబర్ 7న కన్యాకుమారిలో ప్రారంభించి జమ్మూ కాశ్మీర్ వరకు 150 రోజులు 4080 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేశాడు. సామాన్యుల సమస్యలపై పోరాడేందుకు సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం అందించడం ముఖ్య లక్ష్యంగా భారత్ జోడో న్యాయ యాత్ర ను మణిపూర్ నుంచి ముంబై వరకు 15 రాష్ట్రాలు 110 జిల్లాలు 6713 కిలోమీటర్లు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పోలేపాక జానకి రాములు,మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, రేసు బుచ్చిరెడ్డి,నూతి రమేష్ స్థానిక సర్పంచ్ కుంభ వెంకట పాపిరెడ్డి,డిసిసి కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ డిసిసి ఎగ్జిక్యూటివ్ మేంబర్ కుర్షిదు బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పాశం సత్తిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు వాకిటి అనంతరెడ్డి తుమ్మల యుగంధర్ రెడ్డి పబ్బు సురేందర్ చిలుకూరు సత్తిరెడ్డి కాసుల వెంకన్న,ఉలిపే మల్లేశం,కొండూరు సాయి,ఉక్కుర్తి స్వామి,రేఖల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీపాద రావు విగ్రహాన ఆవిష్కరణకు సర్వం సిద్ధం

**– హర్షం వ్యక్తం చేసిన పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఆకుల శ్రీనివాస్...**



మల్హర్, జూన్ 19 ప్రజాకలం ప్రతినిధి : మండల కేంద్రమైన తాడిచర్ల లోని పీఏసీఎస్, తహసిల్దార్ కార్యాలయం సమీపంలో స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహం ఆవిష్కరణకు సర్వం సిద్ధం అవడం పట్ల పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్ శుక్రవారం ఆనందం వ్యక్తం చేశారు. నాడు మంథని నియోజకవర్గ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమించిన ఈ దివంగత మహానాయకుని ఆశయాల బాటలోనే ఆయన కుమారులు, ప్రస్తుత రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ప్రజాసేవకు తమ జీవితాలను అంకితం చేస్తూ నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని వారు కొనియాడారు. త్వరలోనే శ్రీపాదరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

**ఎంపీలకు రూ.50 కోట్ల ఎంఎస్‌పీ..**
## సంజయ్ రౌత్ ఆరోపణ

ముంబై: శివసేన (యూబీటీ)లో చీలిక ఏర్పడనుందని, ఏడుగురు ఎంపీలు పార్టీ ఫిరాయించనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ఎంపీలను పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.50 కోట్ల కనీస మద్దతు ధర నిర్ణయించారని, అందులో రూ.15 కోట్లు అడ్వాన్స్ ఇస్తున్నారని రౌత్ ఆరోపించారు. దీనికిముందు, పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.15 కోట్లు ఆఫర్ చేస్తున్నారనంటూ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా వెంటనే స్పందించారు. 'కేవలం 15 కోట్లేనా? మా ఎంపీలకు రూ.4 కోట్లు అడ్వాన్, తర్వాత 36 నెలల వరకూ నెలకూ రూ.కోటి ఆఫర్ ఇచ్చారు. హనీ ప్లస్ మనీ' అని పోస్టు చేశారు. దీనికి వెంటనే సంజయ్ రౌత్ కౌంటర్ ఇచ్చారు. 'మహువా జీ.. ఒక్కో ఎంపీకి కనీస మద్దతు ధర రూ.50 కోట్లు ఫిక్స్ చేశారు. రూ.15 కోట్లు అడ్వాన్స్ మాత్రమే. నిజానికి వీళ్లు (ఎంపీలు) రూ.50,000 కూడా విలువచేయరు.

# పోచంపల్లికి అదనపు బస్సులు

**- ఆర్టీసీ ఎండి వై నాగిరెడ్డి**

భుదాన్ పోచంపల్లి జూన్ 19 ( ప్రజా కలం ) పోచంపల్లికి అదనపు బస్సులో నడపాలని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, ఆర్టీసీ ఎండి వై నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన చాంబర్ లో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాది మందితో పోచంపల్లి పర్యాటకంగా రూపుదిద్దున క్రమంలో బస్సులు లేకపోవడంతో ప్రతినిత్యం పోచంపల్లి నుండి హైదరాబాద్ కు వెళ్లే వ్యాపార నిమిత్తం, జాబ్ వెళ్లే వారికి బస్సులు సకాలంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని అన్నారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సానుకూలంగా సమాధానం ఇస్తూ ప్రతినిత్యం బీబీనగర్ ఏమ్స్ కు హాస్పిటల్ కి వందలాది మంది ప్రయాణికులు పరీక్షల నిమిత్తం వెళ్తూ ఉంటారని వారికి ఉప్పల్ టు వయా బీబీనగర్ పోచంపల్లి. యాదగిరిగుట్ట టు వయా బీబీనగర్ పోచంపల్లి బస్సుల సర్వీస్ ల పెంచాలని అన్నారు. తక్షణమే



పోచంపల్లి సంబంధించిన బస్ సర్వీస్ ల కాంట్రాక్టర్లను పునరుద్ధరింపజేసే బస్సులను కేటాయించాలని కోరారు. దేనికైనా సానుకూలంగా స్పందిస్తూ ఒకటి రెండు రోజుల్లో బస్సుల పునరుద్ధరింపజేసి యధావిధిగా బస్ సర్వీస్ లో కొనసాగుతాయని తెలియజేశారు. అంతేకాక బీబీనగర్ బస్ సర్వీస్ కి సంబంధించి సమయాలను తెలియజేస్తే దానికి అనుగుణంగా బస్సులను కేటాయిస్తామని ఆయన సానుకూలంగా స్పందించారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి : సిఐటియు డిమాండ్



భుదాన్ పోచంపల్లి జూన్ 19 ( ప్రజా కలం ) మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలను చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు హాజరై మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలను చెల్లించాలని అన్నారు. నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని అన్నారు. నేడు పెట్రోల్ కూరగాయలు సరుకులు ధరలు వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటాయని ఆ ధరల వల్ల కార్మికుల కుటుంబాలు గడిస్తే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరితోపాటు ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి, కార్మికులు ముత్తమ్మ,శంకర్,శారద, చంద్రకళ, జంగయ్య, బుచయ్య, గిరి,శేఖర్, నాగమ్మ, నిర్మల, కృష్ణవేణి, సబిత,రాజు, సత్తయ్య, నరసింహ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న యువతి ఆత్మహత్య

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న 23 ఏళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పన్నెండో తరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచిన సదరు విద్యార్థిని, తన నివాసంలోనే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. "అమ్మా, నాన్నా ఐ లవ్ యూ.. నా మరణానికి ఎవరూ కారణం కాదు" అని హిందీలో రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, మృతురాలిని కార్గిల్ యుద్ధ వీరుడు రాజేష్ థాపా కుమార్తె రియా కుమారి థాపాగా గుర్తించారు. ఉదయం 11:30 గంటల సమయంలో భోజనానికి పిలిచినా ఆమె గది నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తలుపులు బద్దలు కొట్టి చూడగా, రియా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. సాధారణంగా ఆమె రాత్రి వేళల్లో పొద్దుపోయే వరకు చదువుకుని, ఉదయం ఆలస్యంగా నిద్రలేచే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామినేషన్ కోసం రియా సిద్ధమవుతున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అంకిత్ కందారి వెల్లడించారు. మొదటి ప్రయత్నంలో నీట్ అర్హత సాధించలేకపోవడంతో చదువుపై ఏర్పడిన తీవ్ర ఒత్తిడి, నిరాశ కారణంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. పన్నెండో తరగతిలో 97 శాతం మార్కులు సాధించిన రియా, చదువులో ఎంతో ప్రతిభావంతురాలని తెలిసింది. ఈ ఘటనలో ఎలాంటి కుట్ర కోణం లేదని, దీనిని ఆత్మహత్యగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పోటీ పరీక్షల ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఇలా బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## పోలవరం ముంపు ప్రాంతాలను ఆదుకుంటాం

హైదరాబాద : తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస-పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం. 2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరించి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## పీఓకేలో గో బ్యాక్ పాక్

న్యూఢిల్లీ : పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్.. దీన్ని ఆక్రమించిన పాకిస్తాన్ .. దీన్ని 'అజాద్ కశ్మీర్'గా పిలుస్తారు. అక్టోబర్ 24, 1947లో ఏర్పడింది. గిల్గిట్ బాల్టిస్టాన్, అజాద్ కశ్మీర్ ను పాక్ ఆక్రమించింది. ఇది 77 ఏళ్లుగా పాకిస్తాన్ కాలనీగా ఉంది. పేరుకు స్వతంత్ర ప్రాంతం.. కానీ పాకిస్తాన్ పాలనలోనే మగ్గింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. వారు భారత్ లో జమ్మూకశ్మీర్ ఎలా మారుతుందో చూస్తున్నారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు కశ్మీర్ లో పరిస్థితులు మారాయి. ఐఐటీలు, ఐఐఎంలు లాంటి 10 అత్యున్నత సంస్థలు వచ్చాయి. రోడ్లు, మౌళిక వసతులు, బాగా వచ్చాయి. భారత్ ఏమో శత్రుదేశంగా చూస్తే కశ్మీరీలకు భారత్ వల్లే మేలు జరిగింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మాత్రం అక్కడ నష్టం జరిగిందని ఇతర దేశాల్లో ఉన్న కశ్మీరీలు గ్రహించి ఇప్పుడు పీఓకే లో ఆందోళనలు చేపడుతున్నారు. ఒకనాడు కేవలం ఆర్థిక డిమాండ్ల వరకే ఉన్నాయి. గత 10 రోజుల ఆందోళనలో ఈరోజు రాజకీయ డిమాండ్ గా మారింది. మా కశ్మీర్ లో మీరు ఎవరు అంటూ పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. మీ పాక్ సైన్యం ఇక్కడ ఎందుకు అంటూ నినదిస్తున్నారు. పాక్ ఆర్మీ, పాక్ అధికారులు వెళ్లిపోవాలని నినాదాలు చేస్తున్నాడు. ఆడవారు, వేలాది మంది పబ్లిక్ ర్యాలీలు తీస్తున్నారు. మా దేశం వేరు.. మీది వేరు అంటూ మాట్లాడడం మొదలుపెట్టారు. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చి పెంచి పోషించిందే పాక్ ఆక్రమిత కశ్మీర్. కానీ ఇవ్వాల హిందుస్తాన్ తో అయినా కలుస్తాం అని అంటున్నారు.

## హర్మ్యూజ్ జలసంధి తెరుచుకుంది

న్యూఢిల్లీ : మిడిలీస్ట్‌ను కుదిపేసిన ఇరాన్-అమెరికా యుద్ధానికి ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ యుద్ధ విరమణకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. అయితే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా అమలు చేస్తుందా లేదా అన్నదానిపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ ఒప్పందం తర్వాత ఇరాన్ ఒక ప్రకటన చేసింది. శాంతి ఒప్పందంపై చర్చలు పూర్తయ్యాని పేర్కొంది. ఒప్పంద అములుకు ఇది పరీక్ష సమయం అని తెలిపింది. అయితే ఈ రెండు దేశాల మధ్య దాదాపు 14 అంశాలపై రాజీ కుదిరినట్టు తెలుస్తోంది. ఈ 14 అంశాలకు ఏవి అని కూడా తాజాగా అమెరికా ప్రకటించింది. లెబనాన్‌తో పాటు అన్ని వైపులా సైనిక చర్యల నిలిపివేతకు అమెరికా అంగీకరించింది. ఇరాన్-అమెరికా తుది ఒప్పందానికి 60 రోజుల గడువు ఉంటుంది. పరస్పర అంగీకారంతో ఇరు దేశాలు ఈ గడువును పెంచుకోవచ్చు. 30 రోజుల్లో హర్మ్యూజ్ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసి, టోల్ లేకుండా ఇరాన్ నౌకలను అనుమతించాలి.. ఇరాన్ పునర్నిర్మాణ కోసం 300 బిలియన్ డాలర్ల నిధి ఏర్పాటు చేస్తారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ తయారు చేయకూడదని ఇరాన్ అంగీకరించింది. అలాగే ఆంక్షలు ఎత్తివేసే వరకు స్వేచ్ఛగా చమురు అమ్ముకునేందుకు అంగీకరించాలని ఇరాన్ కోరింది. అయితే ఈ మొత్తం 14 అంశాల్లో యురేనియం సంబంధించి ఎక్కడా ప్రస్తావన జరగలేనట్టు కనిపిస్తోంది.

## నగునూరు గ్రామంలో ఎరువుల గోదామును పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్ : జిల్లాలో ఏయే ఎరువులు ఏ డీలర్లకు పంపిణీ చేశారనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని విత్తన కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు మరియు ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే వరి, మొక్కజొన్న మరియు పత్తి విత్తన నిల్వలను గోదాములలో పరిశీలించారు. అనంతరం నగునూరు గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన వరి విత్తనాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508 మరియు కేఎన్ఎం-1638 వంటి వంగడాలను పరిశీలించారు. వాటి విత్తన నిల్వ వివరాలను, టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన పెసర మరియు ఇతర విత్తనాల వివరాలను, అలాగే జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు.

# నేతలను మించిపోతున్న అవినీతి అనకొండలు



హైదరాబాద్ : తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ వరుసగా జరుపుతున్న మెగా దాడులు, అందులో దొరుకుతున్న అక్రమ ఆస్తుల వివరాలు చూసి సామాన్య పౌరుల మైండ్ బ్లాంక్ అవుతోంది. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసాలపై జరిగిన దాడుల్లో మంచాల కింద లభించిన కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, లగ్జరీ ఫ్లాట్ల డాక్యుమెంట్లు ఒక ఎత్తయితే.. అంతకు వారం ముందే రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్ నివాసాల్లో రూ. 200 కోట్ల మార్కెట్ విలువైన అక్రమ ఆస్తులు బయటపడటం మరో ఎత్తు. మే నెలలోనే మెద్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఇళ్లపై జరిగిన దాడుల్లోనూ వంద కోట్ల విలువైన ల్యాండ్ల పత్రాలు దొరికాయి. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో అవినీతి అనేది ఏదో ఒకరిద్దరు అధికారులకో, ఒక శాఖకో పరిమితం కాలేదని.. వ్యవస్థల్లో ఏ స్థాయిలో వేళ్లునురుకుపోయిందో స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, మైనింగ్, ఎక్సైజ్, గృహ నిర్మాణ శాఖల్లో కింది స్థాయి క్లర్క్ నుండి పైస్థాయి డైరెక్టర్ల వరకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ లాగా అవినీతి సాగుతోందని మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జీతం కొన్ని వేలలో ఉండే అధికారుల ఇళ్లలో వందల కోట్ల మార్కెట్ విలువైన బినామీ ఆస్తులు, ఓపెన్ ప్లాట్లు, ఫార్మ్‌హౌస్‌లు బయటపడటం దేనికి సంకేతం? ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో లంచాల పర్వం ఆగకపోగా.. అవినీతి తిమింగలాల ఆస్తుల వేగం మాత్రం జెట్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ఏసీబీ కేవలం పక్కా సమాచారం ఉన్న కొద్దిమంది పైనే దాడులు చేస్తుంటేనే ఈ స్థాయి సంపద కుప్పలుగా తేలుతోంది. రాష్ట్రంలో ఒకరిద్దరు అధికారులను కాకుండా.. కీలక శాఖల్లో ఉన్న క్లాస్-1, క్లాస్-2 గ్రేడ్ అధికారులందరిపై ఆపరేషన్ క్లీన్-అప్ తరహాలో ఏకకాలంలో రాష్ట్రవ్యాప్త తనిఖీలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది? అనుమానితులైన ప్రతి ఉన్నతాధికారి సంపాదనను, వారి బినామీల నెట్‌వర్క్‌ను జల్లెడ పట్టి ఆస్తులన్నీ లెక్కతేల్చి, వాటిని గనుక ప్రభుత్వం జప్తు చేస్తే.. అక్షరాలా తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ కు సమానమైన నిధులు ఒకే ఏడాదిలో సమకూరడం ఖాయమని లెక్కలు వేస్తున్నారు. అంతలా ప్రజాధనం అక్రమార్కుల లాకర్లలో మూలుగుతోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో, ప్రాజెక్టుల రుణాల బదిలీల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటే.. మరోవైపు రాష్ట్రంలోనే కొంతమంది అధికారులు సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతున్నారు. ఈ డిజిటల్ యుగంలో బినామీల పేరిట స్థిరాస్తులు కొనడం, హవాలా మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం పెరిగిపోయింది. ప్రభుత్వం కేవలం సంప్రదాయ ఏసీబీ దాడులకే పరిమితం కాకుండా.. ఆధునిక టెక్నాలజీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఐటీ శాఖల సమన్వయంతో వ్యవస్థాగత శస్త్రచికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ అవినీతి తిమింగలాల గొంతు నొక్కి, అక్రమ ఆస్తులను ప్రజా సంక్షేమానికి మళ్లిస్తేనే.. తెలంగాణ సమాజానికి అసలైన ఆర్థిక స్వాతంత్రం లభిస్తుందని అనుకోవచ్చు.

రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. కేవలం రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. ఇదేదో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ లో నమోదు చేసిన కేసులు కాదు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నమోదు చేసిన కేసులు కాదు. తెలంగాణలో ఏసీబీ ఆఫీసర్లు కరప్షన్ కు పాల్పడుతున్న అధికారుల మీద నమోదు చేసిన కేసులు. పైగా వీరిలో చాలామంది లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటే ట్రాప్ చేస్తున్నారు. అక్రమంగా ఆస్తులను కూడ పెడితే రైడ్ చేస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు ఏకంగా 441 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత స్థాయిలో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు. ఇటీవల కాలంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రాము నాయక్ అనే అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసింది. అతడు ఏకంగా ప్రభుత్వ భూములను ఇతర వ్యక్తులకు అక్రమంగా పట్టా చేయించాడు. దీనికోసం భారీగా లంచం తీసుకున్నాడు. ఇటీవల మోహన్ నాయక్ అనే అధికారి 100 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టిన నేపథ్యంలో.. అతని మీద కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతి అధికారుల మీద ఏసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి ప్రవర్తన మారడం లేదు. ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఒక ఎంపీడీవో, ఎంపీవో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు. పైగా ఆ మహిళా అధికారి తన కుమారుడిని కూడా వసూళ్లకు ప్రత్యేకంగా నియమించుకోవడం విశేషం. ఏసీబీ అధికారుల తనిఖీలు ఆ ఎంపీడీవో, ఎంపీవో పట్టుబడిన నేపథ్యంలో.. అక్కడి ప్రజలు పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అవినీతి అధికారులు రోజురోజుకు ప్రజల మీద పడి దోచుకుంటున్నారు. ఏదైనా పని ఉందని వెళ్తే.. మొహమాటం లేకుండా ఏమిస్తావని అడుగుతున్నారు. తాజాగా ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అతడికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని అధికారులు గుర్తించారు. పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతంలో అతడి నివాసం.. కార్యాలయం.. బంధువుల గృహాలలో తనిఖీలు చేపట్టారు. నరహరి ఇంట్లో ఏకంగా 1.10 కోట్ల నగదును గుర్తించారు. ఇవే కాక బంగారు ఆభరణాలు.. ఇతర రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలలో అతడికి ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉంది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్లు ఉంటుందని తెలుస్తోంది.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం

## రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

రాజన్న సిరిసిల్ల : ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్,గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..."నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజల సహకారంతో జిల్లాలో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టి నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి. జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడుతూ, యువతను మత్తు పదార్థాల దుష్ప్రభావాల నుంచి రక్షించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలిప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిచమన్నారు. కోరుట్లపేట గ్రామంలో ఒక రోడ్డు ప్రమాదం జరగకపోవడం కోరుట్లపేట గ్రామ ప్రజల అవగాహనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని,పరిమితి కి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని ,రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దన్నారు. ఈ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్,ఎస్.ఐ రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయి వరి దిగుబడి

## తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు



హైదరాబాద్ : దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు. దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది. ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది. సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# సునీల్‌ను తలంటిన హైకోర్టు

## ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా- మీకు ఉగ్రవాదులకు తేడ ఏంటీ అంటూ ప్రశ్న

విజయవాడ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి తిరుగుబాటు ఎంపీ రఘురామకృష్ణ రాజు అరెస్ట్, ఆపై సీఐడీ కస్టడీలో జరిగిన థర్డ్ డిగ్రీ వేధింపుల కేసు ఇప్పుడు ఐపీఎస్ అధికారుల మెడకు గట్టిగా చుట్టుకుంటోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి, నాటి సీఐడీ అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక దేశ పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని వ్యాఖ్యానిస్తూ.. అసలు ఎప్పటిలోగా సరెండర్ అవుతారు అని నిందితుడైన ఐపీఎస్ అధికారిని న్యాయస్థానం నిలదీసింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఈ కేసు తీవ్రతను వివరిస్తూ సంచలన పోలికను తెరపైకి తెచ్చింది. దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు.. ఒక పార్లమెంట్ సభ్యుడిని చట్టవిరుద్ధంగా కస్టడీలో పెట్టి శారీరకంగా వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదుఅని హైకోర్టు అభిప్రాయపడింది. చట్టాన్ని రక్షించాల్సిన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా తనను తాను నియంత్రించుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని ప్రశ్నించింది. ఎంపీ రఘురామకృష్ణ రాజును గుంటూరు సీఐడీ ఆఫీసులో అర్ధరాత్రి వేళ బూటుకాళ్లతో తన్నుతూ, అరికాళ్లపై కొడుతూ అమానుషంగా హింసించబోతున్నారనే విషయం ఫిర్యాదుదారుగా ఉన్న సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా ఆధారాలు కనిపిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఇలాంటి కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ముందస్తు బెయిల్ ఒక రక్షణ కవచంగా మారకూడదని బెంచ్ తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఘాటు వైఖరిని గమనించిన సునీల్ నాయక్ తరఫు న్యాయవాది సైలెంట్ అయ్యారు. దీంతో కోర్టు స్పందిస్తూ.. ఈ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొనసాగిస్తారా, లేక చట్టాన్ని గౌరవించి స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకుంటారా అనేది తేల్చుకోవాలని స్పష్టమైన ఛాయిస్ ఇచ్చింది. దీనిపై పిటిషనర్‌తో మాట్లాడి కోర్టుకు తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని లాయర్ కోరడంతో.. హైకోర్టు ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి తుది ఉత్తర్వులు ఇవ్వకుండా తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. 2021లో అప్పటి ఎంపీ రఘురామకృష్ణ రాజుపై సీఐడీ నాన్-బెయిలబుల్ కేసు పెట్టి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసి గుంటూరు తరలించారు. ఆ రోజు కస్టడీలో చిత్రహింసలు పెట్టారని రఘురామ ఆరోపించారు.

# భారతదేశంలో ఇప్పటికే లక్షలాది మంది చేస్తున్న పనినే మీరు కూడా చేస్తున్నారా?

**– అభిషేక్ తివారీ, సీఈఓ, పిజిఐఎం ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్**



హైదరాబాద్, జూన్ 19 (ప్రజాకలం) : దీర్ఘకాలిక లక్ష్యాల ఆధారంగా రూపొందించుకున్న మీ ఎస్ఐపీ పెట్టుబడి కార్యక్రమాన్ని ఒక టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లోని సెషన్‌లా భావిస్తే, ఈక్విటీ మార్కెట్లు సామెతలో చెప్పే బలమైన ప్రత్యర్థిలా ఉంటాయి. అటువంటి పరిస్థితిలో, సాధ్యమైనంత కాలం పోరాటంలో నిలకడగా కొనసాగుతూ, ఎక్కువ సంఖ్యలో సెషన్‌లను గెలుచుకోవడం ద్వారా చివరికి మొత్తం ఆటలో విజయం సాధించవచ్చని ఆశించవచ్చు. అయితే, క్రికెట్‌తో పోలిస్తే ఒక ముఖ్యమైన తేడా ఉంది. కాలం గడిచే కొద్దీ పెట్టుబడుల ప్రపంచంలో సెషన్‌లను గెలుచుకోవడం మరింత సులభమవుతుంది. దీనిని క్రింది ఉదాహరణ ద్వారా వివరిద్దాం.

మీరు ప్రతి నెలా రూ.25,000ను ఈక్విటీ ఆధారిత ఫండ్‌లో ఎస్ఐపీ ద్వారా పెట్టుబడి పెడుతున్నారని, ఈ పెట్టుబడిపై సంవత్సరానికి 10% రాబడి వస్తుందని భావిద్దాం. ఇప్పుడు టెస్ట్ క్రికెట్ ఉదాహరణను దీనికి అన్వయించి చూడండి: ఇందులో 'ప్రతి సెషన్' అంటే ఒక ఏడాది ఎస్ఐపీ, 'ఆట సాగే ప్రతి రోజు' అంటే 3 ఏళ్ల ఎస్ఐపీ కాలం, 'మ్యాచ్' అంటే 15 ఏళ్లు, మరియు 'గెలుపు' అంటే లక్ష్యంగా పెట్టుకున్న కార్పస్ మొత్తాన్ని సాధించడం అని భావించండి. (క్రికెట్‌ను అనుసరించని పాఠకులు కూడా ఈ పోలికను సులభంగా అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాము.)

ఒక పెట్టుబడిదారుగా మీరు ప్రతి సెషన్‌లో (అంటే ప్రతి సంవత్సరం) మార్కెట్లపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ, నిరంతరంగా 10% రాబడిని సాధించగలిగితే, టెస్ట్ మ్యాచ్ ముగిసే సమయానికి (15వ సంవత్సరం చివరినాటికి) మీ పెట్టుబడి విలువ సుమారు రూ.1 కోటికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఇది చాలా స్పష్టమైన గణితం. అయితే, క్రికెట్‌కు భిన్నంగా, 4 మరియు 5వ రోజులకు చేరుకునే కొద్దీ, పరిస్థితులు మీకు విపరీతంగా మెరుగుపడే అవకాశం ఉంటుంది.

ఈ విషయాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి, మన ఉదాహరణలో పేర్కొన్నట్లుగా రూ.1 కోట్ల లక్ష్య కార్పస్‌ను సమకూర్చుకోవడమే మీ లక్ష్యమని భావిద్దాం. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి (అంటే 3వ సంవత్సరం చివరినాటికి), మీరు మీ లక్ష్య కార్పస్‌లో కేవలం సుమారు 10% మాత్రమే సమకూర్చుకోగలుగుతారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి, ఈ మొత్తం లక్ష్య కార్పస్‌లో సుమారు 24% వరకు పెరుగుతుంది. దీనికి విరుద్ధంగా, చివరి రోజు ఆటలోనే మీరు లక్ష్య కార్పస్‌లో సుమారు 33% మేరను సమకూర్చుకుంటారు. మరోసారి ఈ విషయాన్ని గమనించండి – మొదటి 3 సంవత్సరాల బ్లాక్‌లో మీరు మీ లక్ష్య కార్పస్‌లో సుమారు 10% మాత్రమే సమకూర్చుకోగా, చివరి 3 సంవత్సరాల బ్లాక్‌లోనే సుమారు 33% కార్పస్‌ను సమకూర్చుకుంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులపై చక్రవడ్డీ చూపించే ప్రభావం ఎంత శక్తివంతమైనదో దీనివల్ల స్పష్టమవుతుంది

పైన పేర్కొన్న ఉదాహరణ కేవలం ప్రాథమిక భావనను వివరించడానికి రూపొందించిన ఒక ఊహాత్మక ఉదాహరణ మాత్రమే. అయితే, వాస్తవ పరిస్థితుల్లో ప్రతి 3 సంవత్సరాల బ్లాక్ ఒకదానికొకటి భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే మార్కెట్లు వివిధ చక్రాల ద్వారా ప్రయాణిస్తాయి. ఈ ప్రయాణంలో బుల్ మార్కెట్ (వృద్ధి దశ) మరియు బేర్ మార్కెట్ (మాంద్య దశ) కాలాలు రెండూ ఎదురవుతాయి.

ఇప్పుడు ఒక ఆచరణాత్మక ఉదాహరణను పరిశీలిద్దాం. మార్కెట్ చక్రం గరిష్ఠ స్థాయిలో ఉన్న జనవరి 2008లో, నిఫ్టీ 500 టీఆర్ఐ (టోటల్ రిటర్న్ ఇండెక్స్)లో 15 సంవత్సరాల కాలానికి ఒక ఎస్ఐపీ పెట్టుబడి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు భావిద్దాం.

మీరు మార్కెట్ గరిష్ఠ స్థాయిలో పెట్టుబడిని ప్రారంభించినందున (ఇది వాస్తవానికి తరువాత కాలంలో వెనక్కి తిరిగి చూసినప్పుడే తెలిసిన విషయం), మొదటి 3 సంవత్సరాల కాలంలో లభించిన రాబడులు పరిమితంగానే ఉన్నాయి. ఆ తరువాతి 3 సంవత్సరాల బ్లాక్ కూడా మార్కెట్ ఏకీకరణ దశలోనే కొనసాగడంతో, మొత్తం మొదటి 6 సంవత్సరాలు సగటు కంటే తక్కువ రాబడులతోనే గడిచాయి. అయితే, 7వ సంవత్సరం నుండి 15వ సంవత్సరం వరకు మార్కెట్లు ఈక్విటీ అనే ఆస్తి వర్గం నుంచి సాధారణంగా ఆశించే స్థాయిలో రాబడులను అందించడం ప్రారంభించాయి.

ఈ పరిస్థితిలో ఒక పెట్టుబడిదారుగా మీ పనితీరు ఎలా ఉందని మీరు భావిస్తారు? మీరు నిర్దేశించుకున్న లక్ష్య కార్పస్‌ను సమకూర్చుకోగలిగారా? 15 సెషన్‌లలో 6 సెషన్‌లలో మీరు ఆశించిన 10% రాబడిని పొందకపోయినప్పటికీ, మొత్తం మీద మీరు మంచి ఫలితాలను సాధించగలిగారా?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మీరు చాలా బాగా రాణించారు; ఎందుకంటే తర్వాతి సంవత్సరాలలో 'చక్రవడ్డీ ప్రభావం' అద్భుతంగా పనిచేసింది. కింద ఉన్న పట్టికను చూడండి.

9వ సంవత్సరం ముగిసే సమయానికి, మీరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న మొత్తం నిధిలో కేవలం 33% మాత్రమే సమకూరింది. అయితే, తదుపరి 6 సంవత్సరాల్లో మార్కెట్‌లో కొనసాగిన సాపేక్షంగా బుల్లిష్ (ఊర్ధ్వముఖ) దశ కారణంగా, మీరు మీ లక్ష్య నిధిలో మరో 67% సమకూర్చుకోగలిగారు. దీంతో చివరి 3 సంవత్సరాల్లో మీ నిధి దాదాపు రెట్టింపు అయింది.

ఇప్పటికే మీకు ఒక విషయం స్పష్టంగా అర్థమై ఉండాలి---అనిశ్చితితో కూడిన ఈక్విటీ మార్కెట్‌లో 15 సంవత్సరాల కాలానికి ఫలితాలను ఖచ్చితంగా అంచనా వేయడం అసాధ్యం. ఉదాహరణకు, పై ఉదాహరణకు విరుద్ధంగా మార్కెట్లు ప్రారంభ సంవత్సరాల్లో బాగా ప్రదర్శించి, 5వ సంవత్సరంలో భారీ పతనాన్ని ఎదుర్కొన్నాయని ఊహించండి. అటువంటి పరిస్థితి మీ లక్ష్య నిధిని చేరుకోవడాన్ని అడ్డుకోవచ్చు. గుర్తుంచుకోండి, ఎస్ఐపీ కార్యక్రమం భవిష్యత్ రాబడులకు ఎలాంటి హామీ ఇవ్వదు. ఇది కేవలం క్రమశిక్షణతో, మీ బడ్జెట్‌కు అనుకూలంగా, వ్యవస్థీకృత పద్ధతిలో పెట్టుబడులు పెట్టేందుకు సహాయపడుతూ, ఒడిదుడుకులతో కూడిన మార్కెట్లపై విజయావకాశాలను పెంచే ఒక సాధనం మాత్రమే. అదనంగా, మీ ఎస్ఐపీ కార్యక్రమాన్ని మరింత బలమైనదిగా మరియు విశ్వసనీయమైనదిగా తీర్చిదిద్దడానికి కొన్ని ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటిలో: వివిధ ఆస్తి వర్గాల్లో తగిన వైవిధ్యీకరణ కలిగి ఉండటం, నిర్దిష్ట వ్యవధుల్లో లాభాల స్వీకరణ చేయడం, అంటే మొత్తం పోర్ట్‌ఫోలియోను క్రమం తప్పకుండా పునఃసమతుల్యం చేయడం, మార్కెట్లు తక్కువ విలువలో ఉన్న దశల్లో పెట్టుబడులను పెంచడం, మార్కెట్ పతనాలు సంభవించినప్పుడు వ్యూహాత్మకంగా స్పందించడం, వంటి పద్ధతులు సాధారణంగా ఉపయోగించే వ్యూహాలు. ఒక వ్యక్తిగా ఇవన్నీ స్వయంగా నిర్వహించడం మీకు కష్టంగా అనిపిస్తే, ఈ పనిని నిర్వహించేందుకు ఒక నిపుణుడైన ఆర్థిక సలహాదారుడి సహాయం తీసుకోవడం ఎంతో మంచిది.

వాస్తవానికి, పై ఎస్ఐపీ కాలవ్యవధినే ఉదాహరణగా తీసుకుంటే, మరొక గణాంకం ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడిస్తుంది. వృత్తిపరమైన ఆర్థిక సలహాదారుడి సహాయంతో (రెగ్యులర్ ప్లాన్) పెట్టుబడులు పెట్టే పెట్టుబడిదారులు, అటువంటి సలహాదారు లేకుండా (డైరెక్ట్ ప్లాన్) పెట్టుబడులు పెట్టే పెట్టుబడిదారులతో పోలిస్తే, కనీసం మనం ఇంతకుముందు చర్చించిన పెట్టుబడి ప్రవర్తన పరంగా మెరుగ్గా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది.

ఫలితంగా, వారు తమ ఆర్థిక లక్ష్యాలను సాధించే అవకాశాలను మరింత పెంచుకుంటున్నారు.

తదుపరి సారి మీరు SIP ప్రారంభించినప్పుడు, కేవలం కొన్ని నెలలు లేదా రెండు మూడు సంవత్సరాల గురించి మాత్రమే ఆలోచించవద్దు. కనీసం 15 సంవత్సరాల దీర్ఘకాల ప్రయాణానికి కట్టుబడి ఉండండి. అంతకన్నా మెరుగైనది ఏమిటంటే, మీ పెట్టుబడి బృందాన్ని నిర్మించండి, ఒక వృత్తిపరమైన ఆర్థిక సలహాదారుని నియమించుకోండి, మీ పెట్టుబడి వ్యూహాలను వైవిధ్యపరచండి, మరియు ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా మీ ప్రణాళికను కొనసాగించండి. ఎందుకంటే ఈ ఆటలో, కాలమే మీ అత్యుత్తమ బ్యాట్స్‌మన్.

## గోశాలలో వృద్ధుడి హత్య

కృష్ణా జిల్లా : కంకిపాడు మండలం గోశాల గ్రామంలో ఒక స్థలం వివాదంలో మామను అల్లుడు హత్య చేసాడు. అల్లుడు మామ ఛాతి పై దాడి చేసాడు. ఘటనలో గోశాల కు చెందిన ఉప్పల సాంబశివరావు(65) ఘటనా స్థలంలోని మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## త్వరలో పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పూర్తి

**- బద్వేల్ ఏఎంసి నారిసెట్టి సుప్రజ**

పోరుమామిళ్ల వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా కీలక సమావేశం జరిగింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన సమస్యలు, పోరుమామిళ్లలో రైతు బజార్ ఏర్పాటు, బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే అంశాలపై చర్చించారు.అలాగే నిర్మాణంలో ఉన్న పోరుమా మిళ్ల ఉపమార్కెట్ యార్డ్‌ను త్వరలోపూర్తి చేసి రైతులకుఅందుబాటులోకి తీసుకురావాలని కోరారు.అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయ వనరులను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## సాయి కృష్ణ మాయమైన కేసులో సిఐ నాగరాజును పదవి నుంచి తొలగించాలి

మచిలీపట్నం : వి జయవాడకు చెందిన కాపుసేన సభ్యుడు సాయి కృష్ణ తెరమదుగు అవడానికి కారణమైన సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజును సి.ఐ పదవి నుంచి శాశ్వతంగా తొలగించి నాగరాజు కుటుంబానికి 5 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర కాపు సేన లీగల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు బుధవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కాపు కులముకు చెందిన యువకుడు మరణానికి సంబంధించి కాపు ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని బాలాజీ కోరారు. చట్ట వ్యతిరేకంగా రాష్ట్ర నడిబొడ్డిలో జరిగిన నాగరాజు అదృశ్యం రాష్ట్ర ప్రభుత్వానికి తలంపులు తీసుకొచ్చిందని బాలాజీ అన్నారు. రాష్ట్ర డిజిపి ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన సీఐ నాగరాజును విఆర్‌ఓ పంపటం సరైన చర్య కాదని బాలాజీ అన్నారు. తక్షణమే నాగరాజుపై హత్య నేరం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు విలేకరులకు చూపించిన ఫోటోలు చూస్తే నాగరాజు మరణం లాక్ అప్ అప్ డెత్ గా కనిపిస్తుందని బాలాజీ అన్నారు.రాష్ట్ర హైకోర్టు సూచన ప్రకారం నాగరాజు నుహై కోర్టు ఎదుట ప్రవేశపెట్టవలసి ఉండగా అందుకు భిన్నంగా కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదని బాలాజీ అన్నారు.

రౌడీషీటర్లను కాల్చివేయమని ఏ చట్టం, ఏ పోలీసు మాన్యువల్ చెప్పలేదని బాలాజీ అన్నారు. రాష్ట్ర నడిబొడ్డులో కొడుకు నాగరాజు కోసం తల్లి ఆర్తనాదాలు రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయ ని బాలాజీ వాపోయారు. పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. గత ప్రభుత్వం కొంతమంది పోలీసు అధికారు లు యొక్క చట్ట వ్యతిరేక చర్యల వల్ల పూర్తిగా నష్టపోయిందని బాలాజీ అన్నారు. నాగరాజు ఆచూకీపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఎంక్వైరీ జరిపించాలని బాలాజీ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాపులు ని నష్టపరిచే విధంగా చర్యలు జరిగిన అందుకు తగిన పరిహారం చెల్లించవలసి ఉంటుందని బాలాజీ హెచ్చరించారు.

## గులాబీ ఓవర్ కాన్ఫిడెన్సేనా..



హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు.సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

## సన్మానమా... అవమానమా?

### ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థినులకు తీరని అవమానం

### ఒకే శాలువాతో ఇద్దరికి సన్మానం...వివక్ష ఆరోపణలు

తుగ్గలి: ప్రతిభను ప్రోత్సహించాల్సిన విద్యా సంస్థలోనే ఇద్దరు గిరిజన విద్యార్థినులు అవమానానికి గురైన ఘటన తుగ్గలి మండలంలోని రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. పదో తరగతి ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థినులను సన్మానించే కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల వ్యవహారశైలి విమర్శలకు తావిచ్చింది. పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థినులకు వేర్వేరుగా గౌరవం ఇవ్వాల్సిన చోట ఒకే శాలువాను ఇద్దరిపై ఒకేసారి కప్పి సన్మానించడం చర్చనీయాంశంగా మారింది. అంతటితో ఆగకుండా ఒక విద్యార్థినికి స్వీట్ బాక్స్ అందించగా, మరో విద్యార్థినికి కేవలం శాలువా మాత్రమే ఇవ్వడం పలువురి ఆగ్రహానికి కారణమైంది.ప్రతిభకు గుర్తింపుగా నిర్వహించిన కార్యక్రమంలోనే విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం పై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల మధ్య ఎలాంటి తేడా లేకుండా సమాన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పేర్కొంటున్నారు.ఇద్దరు విద్యార్థినులు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే కావడంతో ఈ ఘటనపై వివక్ష కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి."విద్యార్థులు సాధించిన విజయాన్ని గౌరవించకుండా ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం?" అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.విద్యా సంస్థలు సమానత్వానికి ప్రతీకలుగా నిలవాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని సామాజిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.ఈ వ్యవహారంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని,బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు."విద్యార్థుల ప్రతిభను గౌరవించాల్సిన వేదికపై అవమానకర పరిస్థితులు నెలకొనడం అత్యంత విచారకరం.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి" అని ప్రజలు కోరుతున్నారు.

## నల్గొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం చేసిన నిందితులు అరెస్ట్

నల్గొండ : నల్గొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం చేసిన కేసులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి అశోక్ కుమార్ గౌడ్ మరియు మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసారు. జూన్ 6వ తేదీన తెల్లవారుజామున నల్గొండలోని ఎన్టీఆర్ విగ్రహంపై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ గౌడ్, ఎలుకంటి ప్రణీత్ అనే నిందితులు బెడ్ షీట్లు కప్పి, పెట్రోల్ పోసి దహనం చేసారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు బలెనో కారులో వచ్చి విగ్రహానికి నిప్పు పెట్టినట్లు గుర్తించి, వారిని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేసారు.

## తాగునీరు రాలేదని సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట : తాగు నీరు రావడం లేదని సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను గ్రామస్థులు దహనంచేసారు.సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డి పేట గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యను తీర్చాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామ పంచాయతీ ముందు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

## బోయిన్ పల్లిలోని ప్రభుత్వ భూమిని కేటీఆర్ ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేశారు

సికింద్రాబాద్ : బోయిన్ పల్లిలోని ఎన్ఐఎంహెచ్ ముందు ఉన్న 157/1 ప్రభుత్వ భూమిని 2023 లోనే కేటీఆర్ 50 కోట్ల రూపాయల కమిషన్ తీసుకొని, సిసిఎల్ లో అది ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేశారని, కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ మీడియా ముందు ఆరోపించారు. నేడు కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం బ్రిగేడియర్, బోర్డు సీఈవో అధ్యక్షతన నిర్వహించగా, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్ లు హాజరై పలు బోర్డు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేష్ మీడియాతో మాట్లాడుతూ 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ అభివృద్ధే ధ్యేయంగా పనులను ప్రారంభించాలని బోర్డులో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. 3వ వార్డు మట్ ఫోర్డ్ లో పేదలు నివసించే గుడిసెలను తొలగించేది లేదని తెలిపారు. భవన మెటీరియల్, చెత్త సేకరణ బండ్లను రోడ్డుపై కాకుండా లోపటికి పెట్టాలని బోర్డు అధికారులు ఆదేశిస్తే, దాన్ని కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేశారని హెద్దేవా చేశారు. బోయిన్ పల్లిలోని ప్రభుత్వ స్థలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. గతంలో బిఆర్ఎస్ పది సంవత్సరాల అధికారంలో ఉన్నప్పుడు ఇదే ప్రభుత్వ భూమిని కేటీఆర్ ఎందుకు కాపాడలేకపోయారు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ లు తీసుకొని తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు మరొకసారి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ...మడ్ ఫోర్డ్ గుడిసెలు, బోయిన్ పల్లి ప్రభుత్వ స్థలంపై స్పందిస్తూ ప్రభుత్వ భూములను కాపాడుతామని, పేదలు నివసించే గుడిసెలను తొలగించవద్దని, ఇట్టి వివాదంపై డిఫెన్స్ అధికారులకు దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

## రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

హైదరాబాద్ : ప్రభుత్వం బోనస్ ఇస్తామంటున్న 7 రకాల వడ్ల వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్లు నష్టపోతారు. అంటే ఒక్కో రైతుకు రూ. 24 వేల దిగుబడి తగ్గే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి అన్నారు. అయన మీడియాతో మాట్లాడారు. 33 రకాల వడ్లలో ప్రభుత్వం గుర్తిస్తున్న 7 రకాల వడ్లు ఎకరాకి 20 క్వింటాళ్లు పండితే మిగతా 26 రకాలు మాత్రం ఎకరాకు 30 క్వింటాళ్లు పండుతాయి. ఈ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు 10 క్వింటాళ్లు ఎక్కువ నష్టపోతారని అన్నారు.రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. ఈ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో 7600 మంది చనిపోయిన రైతులకు రైతు బీమా డబ్బులు రాలేదు.

## ముున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో సామాజిక సేవా కార్యక్రమాలు




హైదరాబాద్, జూన్ 19(ప్రజా కలం ప్రతినిధి)

కిమ్స్ సన్ షైన్ సహకారంతో ప్రముఖ కార్డియాలజీ నిపుణులు డా. శ్రీధర్ కస్తూరి, డా.కషీఫ్ ప్రత్యేక వైద్యులతో కలిసి కాచిగూడ లోని మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహంలో ఉచిత కార్డియాక్ క్యాంపును నిర్వహించారు. ఈ శిబిరంలో ఈవో రాజన్న మరియు వ్యవస్థాపక ట్రస్టీల కుటుంబ సభ్యులు దదువై రాఘవేందర్, ఏనుగుల మాణిక్ ప్రభు, ఆకుల పాండురంగారావు, దదువై రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండె సంబంధిత వ్యాధులపై వైద్య నిపుణులు సలహాలు సూచనలు అందించారు. జబ్బు వచ్చాక బాధపడడం కన్నా ముందస్తు అవగాహనతో చాలా వరకు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు వివరించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అనేక వర్గాల ప్రజలకు సేవ చేసే ఈ శిబిరాలను ముందుకు తీసుకెళ్లాలని ఉద్దేశంతో,విద్యా, సామాజిక సంక్షేమంతో పాటు వైద్యపరమైన లక్ష్యాలను కూడా కలిగి ఉన్న ట్రస్ట్‌కు కట్టుబడి ఈ శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. దేవాదాయ శాఖ మద్దతుతో మరిన్ని శిబిరాలను నిర్వహిస్తుందని తెలిపారు.

ట్రస్ట్ లక్ష్యాలకు అనుగుణంగా అందించబోయే సేవలకు, వ్యవస్థాపక ట్రస్టీల కుటుంబ సభ్యులు, సీనియర్ సభ్యులకు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని వారు తెలిపారు.

## డాక్టర్ డి. ప్రేమా నందంకు ఘన సన్మానం చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 19 ( ప్రజా కలం):

డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ డి. ప్రేమానందంను సంగారెడ్డి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ డి. ప్రేమానందంకు గౌరవ డాక్టరేట్ అవార్డు లభించిన సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ మండల మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎం. విఠల్, మండల ప్రధాన కార్యదర్శి పి. గోవర్ధన్ రెడ్డి, సదాశివపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్, సదాశివపేట పట్టణ నాయకులు అశోక్, సంగారెడ్డి పట్టణ మాజీ కౌన్సిలర్ జి.వి. శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఎం.డి. మజీద్, సంగారెడ్డి పట్టణ మైనారిటీ బీఆర్ఎస్ నాయకులు, ఎం. కిష్టయ్య తదితరులు పాల్గొని డాక్టర్ డి. ప్రేమానందంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు, కొడుకు మృతి

మేడ్చల్ : మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరపల్లి రాజీవ్ రహదారిపై అర్ధ రాత్రి జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కరీంనగర్ కు చెందిన రైల్వే ఉద్యోగి చంద్ర శేఖర్ మరియు అతని భార్య రేఖ మరియు రేఖ చెల్లెలి కుమారుడు నిహాల్ 2 సంవత్సరాలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కారు అదుపు తప్పి అటుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

## రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలి

పిడుగురాళ్ల :రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని జూన్ 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి అన్నారు. పిడుగురాళ్ల ఎస్ టి యూ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని అన్నారు. గురజాల నియోజకవర్గం కార్యదర్శి కందిమళ్ల సైదారావు మాట్లాడుతూ, డాక్టర్ ఎం ఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి, పంట రుణాలను ఇవ్వాలన్నారు. విజయవాడలో జరుగు ధర్నా చౌక్ వద్దకు ఈ నెల 30వ తేదీన గురజాల నియోజకవర్గం నుంచి రైతులు పాల్గొని ముఖ్యమంత్రి కార్యాలయం రాయబారాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ళ అంజలి, అక్కెనపల్లి బాలయ్య, షేక్ సైదా, షేక్ నజీర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష

హైదరాబాద్ : ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్–2021కు సంబంధించిన 11 శాతం ఫిట్మెంట్ను జూలై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించాం. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ను త్వరలో విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. నాగర్కర్నూల్, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయడంతో పాటు మంజూరైన బస్ స్టేషన్ల శంకుస్థాపనలకు కార్యాచరణ రూపొందించాలని సూచించాను. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు అందించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఎస్సీ బాలికల హాస్టల్ లో నీటి పైపుకు లీకేజీ

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం కేంద్రంలోని దొడగట్ట రోడ్ లోని ఎస్సీ బాలికల హాస్టల్. ఈ హాస్టల్ ప్రాంగణంలో సత్యసాయి నీటి సరఫరా పైప్ లైన్ కు లీకేజీ పడింది. పదిరోజులుగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. సెలవుల అనంతరం హాస్టల్ కి విద్యార్థినులు వచ్చేశారు. ఈ నీటి ప్రవాహం లోనే విద్యార్థులు నడవాల్సివస్తుంది. నీటి నిల్వ కారణంగా దోమలు ఎక్కువవుతున్నాయి. అన్పైప్ లైన్లు మరమ్మతులు చేసినా ప్రెజర్ కారణంగా పూర్తి స్థాయిలో ఆగిపోలేదని హాస్టల్ వార్డెన్ అంటున్నారు. సత్యసాయి నీటి సరఫరా ఇంజనీర్లు చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతం లోని నివాస గృహాల వారు హాస్టల్ బయట ప్రధాన ద్వారం ముందరే చెత్త కుప్ప వేస్తున్నారు.

# సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా 350 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి
- 200 కేజీల భారీ కేక్ ని చిన్నారులతో కలిసి కట్ చేసిన జగ్గారెడ్డి
- ఈ సందర్భంగా కార్యకర్తలు రక్తదానం చేశారు
- బీజేపీ నేతలకు తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సవాల్





సంగారెడ్డి ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ బిహెచ్ఎల్ డిడిఎల్ ఓడిఎఫ్ ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ లాంటి కేంద్ర సంస్థలు సంగారెడ్డి జిల్లాకి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది న్నారు. బీజేపీ మాత్రం ఉన్న కేంద్ర రంగ సంస్థలని ప్రయివేటీకరణ చేస్తుందని ఆరోపించారు. బీజేపీ నేతలు నెహ్రూ పాలనని బ్రేక్ చేశామని సంబరాలు చేస్తున్నారు. రాహుల్ గాంధీ తల్లి, తండ్రి, తాత, నానమ్మ, ముత్తాత దేశం కోసం ఎం చేశారో నేను చెప్తాను దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. మరి 12 ఏళ్ల ప్రధాని మోడీ పాలనలో ఏం చేశారో సమాధానం చెబుతారా అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న కోడి సర్కార్ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల పేరుతో ప్రధాని మోడీ యువతకి 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారని అన్నారు. బిజేపీ నేతలు దేవుళ్లపైనే కుట్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇతర పార్టీలకు దేవుళ్ళతో సంబంధాన్ని వీడదీశారని అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా చిన్నారులకు 350 మంది సైకిళ్లు పంపిణీ చేశామని తెలిపారు. రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ప్రజలతో పాటు, దేశ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో టిజి ఐఐసి చైర్మన్ నిర్మల, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తోపా అనంత కిషన్ , కూన సంతోష్ , కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రజతోత్సవ వేడుకలు

## నామస్మరణతో మారుమోగిన మెదక్ అయ్యప్ప ఆలయం





మెదక్ జూన్ 19(ప్రజాకలం ప్రతినిధి)ఆలయ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక అయ్యప్ప దేవాలయంలో స్వామి మూలవిరాట్ మూర్తికి ఫలపంచామృత మహాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేట మదనానంద పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతీ స్వామి కరకముల చేత ఈక్రతువు కొనసాగగా, ఆలయ గోపుర శిఖరానికి భక్తులు అభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అష్టోత్తర శతకలశ స్థాపన పూజ నిర్వహించారు. అనంతరం మాధవానంద సరస్వతీ స్వామి. నవగ్రహాలు, ఆంజనేయస్వామి, శివలింగానికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామి గర్భగుడిలోని అయ్యప్ప స్వామి మూలవిరాటు ఫలపంచామృత మహాభిషేకం నిర్వహించగా, అదే సమయంలో ఆలయ శిఖరానికి అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర ధర్మాధికారి అష్టకాల విద్యామనోహరశర్మ, హరిదాస్ గురుస్వామి , ఆలయ సేవకులు వైద్యరాజు పంతులు, వేదపండితులు, భక్తులు అభిషేకం చేశారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రథయాత్రవేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రథ యాత్రను నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవవిగ్రహాన్ని రథంపై అలంకరించి. మెదక్ పట్టణ పురవీధులగుండా ఊరేగించారు. కేరళ వాయిద్యం, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. స్థానిక ఆలయం వద్ద ప్రారంభమైన రథయాత్ర మార్కెట్, జేఎన్రోడ్డు, రాందాస్ చౌరస్తా, ఎంజే రోడ్డు, పాతబస్టాండ్ మీదుగా కొనసాగింది. సాయంత్రం ఆలయంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు వైద్యశ్రీనివాస్, వైద్యమణికంఠ, అశోక్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక, మాజీ చైర్మెన్లు భట్టిజగపతి, మల్లికార్జున్ గౌడ్, చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఆలయ బాధ్యులు వీర్ కుమార్ , రామాంజనేయులు, చక్రపాణి, కొండ శ్రీనివాస్, వెంకట్ నారాయణ, ఉప్పల శ్రీనివాస్, పార్థివనాథ్ రాజు, రమేశ్ ,రాజన్, తదితరులు పాల్గొన్నారు.


## ఆలయ నిర్మాణానికి హైడ్రా బ్రేక్..

# పటాన్‌చెరులో ఉద్రిక్తత..

- ఆలయ నిర్మాణం ఆపివేత.. పటాన్‌చెరులో ఉద్రిక్తత చెలరేగింది..
- ఆలయ వివాదం.. హైడ్రా, స్థానిక నేతల మధ్య చర్చలు..

పటాన్‌చెరు జూన్19 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు డివిజన్‌లో ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిర్మాణంలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను అధికారులు నిలిపివేయడంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక భక్తులు, ప్రజల కోసం చేపట్టిన ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తమవుతుండగా, ఈ ఘటన రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. స్థానిక సమాచారం ప్రకారం, నిర్మాణ దశలో ఉన్న ఆలయ పనులను హైడ్రా అధికారులు నిలిపివేయడంతో విషయం తీవ్రతను సంతరించుకుంది. ఈ పరిణామంపై సమాచారం అందుకున్న పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అధికారులతో ప్రత్యక్షంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ స్థలం పూర్తిగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోనే ఉందని స్పష్టం చేశారు. ఈ ఆలయం పూర్తిగా స్థానిక ప్రజల ఆధ్యాత్మిక అవసరాలు, భక్తి భావాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించబడుతున్నదని తెలిపారు. ఇందులో ఎటువంటి ప్రైవేట్ ప్రయోజనాలు లేదా వ్యక్తిగత నిర్మాణాలు లేవని ఆయన అధికారులకు వివరించారు. ప్రజల విశ్వాసానికి సంబంధించిన నిర్మాణాలను అడ్డుకోవడం సరైన చర్య కాదని




ఆయన అభిప్రాయపడ్డారు. ఆలయ నిర్మాణం ఆపివేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, వెంటనే నిర్మాణ పనులను పునరుద్ధరించేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతుండగా, భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొని ఆలయ నిర్మాణానికి మద్దతు తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు..

## దేవస్థానంలో బాధ్యతల బదిలీ

- శేషిధర్ గుప్తకు ఘన వీడ్కోలు సన్మానం..
- దేవనాథం బాధ్యతల స్వీకారం.. ఆలయాభివృద్ధిపై ఆశలు..

పటాన్‌చెరు జూన్19 (ప్రజా కలం) ప్రతినిధి



శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి బాధ్యతల మార్పిడి సందర్భంగా ఘన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న కార్యనిర్వహణాధికారి శేషిధర్ గుప్తను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించగా, నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన దేవనాథంకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన శేషిధర్ గుప్త సేవలను కొనియాడిన కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కార్యనిర్వహణాధికారి దేవనాథంకు సన్మానం చేసి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, శేషిధర్ గుప్త పదవీకాలంలో ఆలయం పలు అభివృద్ధి కార్యక్రమాలతో ముందడుగు వేసిందని తెలిపారు. దేవనాథం నాయకత్వంలో ఆలయం మరింత అభివృద్ధి చెందడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు..

## టి యు డబ్ల్యూ జే యూనియన్ ప్రతి జర్నలిస్టులకు అండగా ఉంటుంది

**జిల్లా టి యు డబ్ల్యూ జే అధ్యక్షులు శంకర్ దయాల్ చారి**





మెదక్ జూన్ 19(ప్రజాకలం ప్రతినిధి) టి యు డబ్ల్యూ జే యూనియన్ ప్రతి జర్నలిస్టులకు అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి అన్నారు. కొల్చారం మండల కేంద్రమైన కొల్చారం లో జైన దేవాలయంలో శుక్రవారం టి యు డబ్ల్యూ జె యూనియన్ లో సభ్యత్వ నమోదు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శంకర్ దయాల్ చారి , టీయూడబ్ల్యూజే నాయకులు తిమ్మన్నగారి శ్రీధర్, సంతోష్ లు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి, అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి టి యు డబ్ల్యూ జే కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌరిగారి నాగభూషణం, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, బిక్షపతి , టి శ్రీధర్, ఆవుసుల పాండురంగ చారి, శివకుమార్ గౌడ్, గోపాల్, వనమాల అనిల్, వనమాల శ్రీధర్, చిన్న ఘణపూర్ శ్రీనివాస్, చింతల రమేష్, భూపాల్, వడ్డే రాజు, నవీన్, వంశీ, భూమయ్య ప్రవీణ్, శ్రీశైలం, పురుషోత్తం, యేసురత్నం, నరసింహులు, లక్ష్మీనారాయణ, యాదగిరి, దుర్గ ప్రసాద్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు

## పాఠశాలల బస్సులో భద్రత నిబంధనలు తప్పనిసరి

**- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ**

గజ్వేల్:19 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట పోలీస్ కమిషనర్ (సీపీ) ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని పిడిచేడు రోడ్డుపై శుక్రవారం పాఠశాల బస్సులపై గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాలు, వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు,సహాయక సిబ్బందికి విద్యార్థుల భద్రతకు సంబంధించిన పలు సూచనలు చేశారు. బస్సు డ్రైవర్లు పరిశుభ్రమైన యూనిఫాం ధరించి నేమ్ బ్యాడ్జ్‌తో విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్,ఇన్సూరెన్స్,పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్,జీపీఎస్ పరికరం,ఒక హెల్పర్ అందుబాటులో ఉండాలని సూచించారు. సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా పనిచేస్తుందో లేదో కూడా తనిఖీ చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం పాఠశాల బస్సులు నిర్దేశించిన అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కోరారు.



## తుక్కుగూడ బిఎస్ బావర్చి ని సందర్శించిన తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటే కార్ మధుమోహన్



మహేశ్వరం, జూన్ 18,(ప్రజా కలం)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ పరిధిలోని 66వ వార్డ్ తుక్కుగూడ పట్టణంలో బిఎస్ బావర్చి ని తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటే కార్ మధుమోహన్ సందర్శించారు. భారతీయ జనతా పార్టీ నాయకులు జాపాల సుధాకర్, బిఎస్ బావర్చి నిర్వాహకులు బషీర్, సొంత వ్యాపారంతో రాణిస్తున్నారు యువకులు ఉద్యోగాలే కాకుండా వ్యాపార రంగంలో కూడా రాణించాల్సిందిగా మాజీ చైర్మన్ తెలిపారు.

## ఆర్ జి కె క్వాటర్స్ లో వాటర్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

– రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్ర నగర్, జూన్ 18,(ప్రజా కలం) రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ వాంబే కాలనీ స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీ లోని సమస్యలపై ఆర్ జి కె క్వాటర్స్ లోని స్థానిక సమస్యలపై ప్రధానంగా వేసవి కాలం కారణంగా నీటి సమస్యల ఉందని స్థానికులు రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి కి తెలపడంతో దానికి సంబంధించిన సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధించిన వారిని ఫోన్ లో మాట్లాడం జరిగింది. అదే విధంగా భూగర్భ డ్రైనేజ్ వ్యవస్త దెబ్బతిన పైప్ లైన్ అదే విధంగా పైన బాల్కనీ మరమ్మతు సమస్యల పై అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యలను సమస్య పరిష్కారం అయ్యేవిదంగా చూస్తానని కాలనీ వాసులకు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా బస్తీ లోని స్థానిక నాయకులను ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజా సమస్యల పై దృష్టి సారించాలని తెలియజేయడం జరిగింది. ప్రజలు తమ ఇంటి పరిసర లలో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బుచ్చి రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, సంతు గౌడ్, తలారి చిన్న, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీ గారు శోభ గారు బబ్లూ, పృధ్వీ రాజ్, అరుణ్ మజర్ భాయ్, ఎన్ను శంకర్ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రావిరాల గ్రామంలో విద్యుత్ అంతరాయం


### మహేశ్వరం ఏ ఈ చక్రపాణి

మహేశ్వరం, జూన్ 18, (ప్రజా కలం) మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో శనివారం నాడు విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1వరకు రావిర్యాల, కొంగర కుర్దు,వండర్ల, కళాజ్యోతి మరియు అలాగే మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 6 వరకు ఓ ఆర్ ఆర్ రావిర్యాల ఎగ్జిట్, కలెక్టర్ ఆఫీస్ రోడ్, గూగి విల్లాస్ లలో విద్యుత్ అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించగలని మహేశ్వరం ఏ ఈ చక్రపాణి తెలిపారు.

## ఫ్లై ఓవర్ కింద గుర్తుతెలియని వ్యక్తి మృతి

### లిమ్స్ ఆస్పత్రి సమీపంలో ఘటన - మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

శంషాబాద్, జూన్ 19:– (ప్రజా కలం)
శంషాబాద్ పరిధిలోని లిమ్స్ ఆస్పత్రి సమీపంలోని ఫ్లైఓవర్ కింద గుర్తుతెలియని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. మృతుడి



వయస్సు సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు.స్థానికుల సమాచారం మేరకు, మృతుడు కొంతకాలంగా శంషాబాద్ ప్రాంతంలో బిచ్చగాడిగా తిరుగుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. అతని కుడికాలు విరిగిపోయి కట్లు కట్టిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెందిన ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నట్లు సమాచారం.మృతుడి వివరాలు, చిరునామా లేదా బంధువుల గురించి ఎలాంటి సమాచారం లభించకపోవడంతో పోలీసులు గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## అంగన్వాడి చిన్నారుల మధ్యలో కాంగ్రెస్ నాయకులు బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు

మల్కాజిగిరి,జూన్ 19 (ప్రజా కలం ప్రతినిధి) మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు బ్రహ్మయ్య జన్మదిన సందర్భంగా దొడ్లబస్తీ అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు పళ్ళు బిస్కెట్లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షులు నోరిసత్యమూర్తి బ్రహ్మయ్య ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోడివిజన్అధ్యక్షులు నోరి సత్యమూర్తి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు,శంకర్, రాము,రాహుల్,హరి కిషన్, రత్నభూషణ్, మోయిన్ లఖాన్,మజీద్, రామకృష్ణ శ్రీనివాస్,ప్రేమ్, వీరాచారి, సత్యనారాయణ, జగదీశ్వర్ రావు, అంగన్వాడీ నిర్వాహకులు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు అమలు చేయాలి

## కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తాం- కాంట్రాక్ట్ వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలి

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 19 (ప్రజా కలం): ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని కాంట్రాక్ట్ వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు అన్నారు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించడం ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి, సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని కార్మికులకు ఈఎస్ ఐ, పీఎఫ్ సౌకర్యం సరిగా పనిచేయకపోవడంతో అనేక మంది కార్మికులు ఇబ్బంది పడుతున్న ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు స్పందించకపోవడం చాలా దారుణం అని అన్నారు కాంట్రాక్టు వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, వానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ చాలా సమస్యలతో బాధపడుతున్నారు. కార్మికులకు కాంట్రాక్టర్ చాలా ఇబ్బందులు పెడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ చెల్లిస్తున్నారు. అన్ని హాస్పిటల్స్ లో ప్రభుత్వం నిర్ణయించిన రూ. 15,600/-లలో కార్మికుడికి రూ. 12,093/-లు చెల్లించి మిగిలినవి పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయవల్సి ఉంది. కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్నీ కుమ్మక్కై రాష్ట్రవ్యాప్తంగా రూ. 10,500/-లు, రూ. 11,000/-లు మాత్రమే చెల్లిస్తున్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వగలరు. ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోగలరని కోరుతున్నాము. హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ను పర్మినెంట్ చేయాలి. ఆలోపు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి ప్రభుత్వం నిర్ణయించిన వేతనం రూ. 15,600/- లు టెక్ హటరీమ్ శాలరీ రూ. 12,093/- లు ఇప్పించగలరు. చెల్లించని కాంట్రాక్టీకరణపై కఠిన



చర్యలు తీసుకోగలరు. పిఎఫ్ లో యజమాని వాటాను రూ. 15,600/-లు కూడా కార్మికుడి వేతనంలో కట్ చేసి జమ చేస్తున్నారు. ప్రభుత్వం విడిగా 12% వాటా చెల్లించాలి. పిఎఫ్, ఈఎస్ఐ వాటాలు ప్రతినెలా కార్మికుల జీతాల్లో జమ చేయాలి.ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలి. పాత కార్మికులను తొలగించి వివిధ సాకులతో కొత్తవారిని నియమించుకుంటున్నారు. 50 సంవత్సరాల వయస్సు దాటిందని తొలగిస్తున్నారు. వీటిని ఆపగలరు. పాత కార్మికులను తొలగించి వివిధ సాకులతో కొత్తవారిని నియమించుకుంటున్నారు. 50 సంవత్సరాల వయస్సు దాటిందని తొలగిస్తున్నారు. వీటిని ఆపగలరు. కాంట్రాక్టర్ల వేధింపులు అరికట్టగలరు.హాస్పిటల్ వర్కర్స్కు డ్రెస్ చేంజ్ రూమ్లు లేకపోవడంతో పేషంట్స్ టాయిలెట్స్, బాత్రూమ్లలో డ్రెస్ చేంజ్ చేసుకుంటున్నారు. రెస్ట్ రూమ్లు లేకపోవడంతో భోజనాలు వరండాలు, వార్డులు, చెట్ల క్రింద చేస్తున్నారు. ప్రత్యేకంగా రెస్ట్ రూమ్లు ఏర్పాటు చేయాలి ఐడి కార్డు, యూనిఫాం, బ్లౌజులు, షూస్, ఇతర పరికరాలు సరిపడా ఇవ్వగలరు. ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాట నిర్వహిస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారుఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం, యాదగిరి నాయకులు సదానందం, యాదగిరి ఆంజనేయులు, నాగరాజు రమాదేవి, శారద, సునీత భాగ్యలక్ష్మి, రత్నయ్య, సునీత అనిత, నిఖిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరంలో

# ఏఐ డిజిటల్ లెర్నింగ్ శిక్షణ

- కృత్రిమ మేధస్సు డిజిటల్ లెర్నింగ్ అంశాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సంగి రమేశ్




మహేశ్వరం, జూన్ 18,(ప్రజా కలం)
కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న అక్క మెంటార్ షిప్ కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేధస్సు డిజిటల్ లెర్నింగ్ అంశాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" ప్రస్తుత విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధస్సు డిజిటల్ సాంకేతిక వినియోగం ఎంతో కీలకమైందనీ,ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు ఆధునిక బోధన విధానాలను అవగాహన చేసుకుని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే విధంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం శనివారం కూడా కొనసాగునుందని, ఏ ఐ డిజిటల్ విద్యకు సంబంధించిన పలు అంశాలపై మరిన్ని సెషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ వెల్లడించారు. మాస్టర్ ట్రైనర్ రవీంద్ర ఎం వి ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ పాల్గొని ఏఐ డిజిటల్ టూల్స్, స్మార్ట్ క్లాస్ రూమ్స్, ఆన్లైన్ విద్యా వనరులు ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారు. అన్న అక్క మెంటార్ షిప్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన డిగ్రీ కళాశాల విద్యార్థులు తమకు కేటాయించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బోధన అందించనున్నారు. పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంపొందించడం భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో నోడల్ అధికారులుగా డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ( వాణిజ్య శాఖ) రవళిక, శిరీష( కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ శాఖ) డాక్టర్ జహీదా బేగం( ఎన్ఎస్ఎస్ఓ రాజనీతి శాస్త్రం) సమన్వయం వహిస్తున్నారు. అధ్యాపకులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### లక్ష్యాన్ని అధిగమించి 5 లక్షల

# మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- 97,807 మంది రైతుల నుంచి రూ.1,204 కోట్ల విలువైన ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.1,036 కోట్లు జమ.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 19.
సిద్ధిపేట జిల్లాలో యాసంగి (రబీ) 2025-26 సీజన్‌కు సంబంధించిన వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తైందని జిల్లా కలెక్టర్ కే. హైమవతి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన 4.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని అధిగమిస్తూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 427 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని 97,807 మంది రైతుల నుంచి రూ. 1,204 కోట్ల విలువైన వరి ధాన్యాన్ని సేకరించగా, అందులో ఇప్పటికే రూ. 1,036 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన చెల్లింపులు ట్యాబ్ ఎంట్రీలు పూర్తికాగానే త్వరితగతిన విడుదల చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆధ్వర్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో కొనుగోళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగాయని తెలిపారు. అదనపు హమాలీలు, రవాణా వాహనాలు ఏర్పాటు చేయడం, మిల్లర్లతో సమన్వయం కొనసాగించడం ద్వారా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా వాహనాలు వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో



పర్యటిస్తూ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. కొనుగోలు చేసిన మొత్తం 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులు, గోదాములకు తరలించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అదనపు గోదాములు అద్దెకు తీసుకుని నిల్వ సౌకర్యాలు కల్పించడం వల్ల ఎక్కడా ధాన్యం నిల్వ సమస్యలు తలెత్తలేదన్నారు.
జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తికావడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాల శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ హైమవతి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' స్థలాన్ని పరిశీలించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



శంషాబాద్, జూన్ 18 (ప్రజా కలం) రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' (శంషాబాద్) రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం, శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగుడా గ్రామంలో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ఈరోజు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్కూల్ నిర్మాణానికి సంబంధించిన మౌలిక వసతులు, రోడ్డు కనెక్టివిటీపై అధికారులతో చర్చించారు. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు వెళ్లే అనుసంధాన (అప్రోచ్) రోడ్డు సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవ తీసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న స్థానిక రైతులతో ఆయన స్వయంగా మాట్లాడారు. నష్టపోతున్న రైతులకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రదేశాలలో వారికి అనువైన ప్రభుత్వ భూమిని కేటాయించేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు సైతం సానుకూలంగా స్పందించడంతో రోడ్డు సమస్య సుఖాంతమైంది.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లో రాహుల్ జయహో..

పటాన్‌చేరు, జూన్19 (ప్రజా కలం) ప్రతినిధి
భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు అమీన్‌పూర్ పట్టణంలో ఉత్సాహంగా జరిగాయి



అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. దేశ ప్రజల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజాక్షేత్రంలోనూ ధైర్యంగా ప్రస్తావిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు
రైతులు, యువత, మహిళలు, పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, జాతీయ విద్యార్థి సంఘం, సేవాదళ్ నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు..

## మందు బాబులకు
# లోక్ అదాలత్ షాక్..!

- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 143 మందికి జరిమానాలు
- మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష, భారీ ఫైన్





వేములవాడ, జూన్ 19
( ప్రజా కలం ప్రతినిధి ):


మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన 143 మందిని శుక్రవారం లోక్ అదాలత్‌లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరిచారు. కేసులను విచారించిన మేజిస్ట్రేట్ మేఘన నిందితులకు జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

జరిమానాల వివరాలు
22 మందికి ఒక్కొక్కరికి రూ. 4,000 చొప్పున
ఒకరికి రూ. 5,000 జరిమానా
53 మందికి ఒక్కొక్కరికి రూ. 3,000 చొప్పున
59 మందికి ఒక్కొక్కరికి రూ. 2,000 చొప్పున
5 మందికి ఒక్కొక్కరికి రూ. 2,500 చొప్పున
3 మందికి ఒక్కొక్కరికి రూ. 3,500 చొప్పున
జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను కష్టాల్లోకి నెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు వాహన తనిఖీలు నిరంతరం నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

## పోచమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఏనుగు మనోహర్ రెడ్డి

- పెద్దమ్మ, దుర్గమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



వేములవాడ, జూన్ 19 ( ప్రజా కలం ప్రతినిధి ):

వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోచమ్మ బోనాల ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా మహాలక్ష్మీ వీధిలోని పెద్దమ్మ-దుర్గమ్మ తల్లి ఆలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం ఏనుగు మనోహర్ రెడ్డి భక్తులతో కలిసి మొక్కులు చెల్లించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని అన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వేములవాడ పట్టణం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ శాంతి, సౌభాగ్యాలతో జీవించాలని ప్రార్థించిన ట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలా డాయి. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు భైరి సతీష్, కౌన్సిలర్ వాసాల లావణ్య- శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు మల్లికార్జున్, న్యాయవాదులు రేగుల దేవేందర్, కందుల క్రాంతికుమార్, మాజి కౌన్సిలర్ మారం కుమార్, మాజీ ఎంపీటీసీ ఐలవేని రాజేందర్, బిజెపి నాయకులు కటుకం శ్రీనివాస్,గొట్టం శంకర్,మధు,, తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలను స్వీకరించిన వెంకటయ్య

మల్కాజిగిరి,జూన్ 19 (ప్రజా కలం ప్రతినిధి)
మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఏ వెంకటయ్య శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడం కోసం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేసుకుంటూ ముందుకు వెళ్తామని ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం లేకుండా పరిష్కరించేందుకు చర్యలు ఉంటాయని చెప్పారు.




## మౌలిక సదుపాయాలు మెరుగుపడితే
# గ్రామాల అభివృద్ధి

### తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు
### రూ.87 కోట్ల విలువైన సీఆర్ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన
### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
### రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





రంగారెడ్డి జిల్లా మహేశ్వరం,
ఇబ్రహీంపట్నం జూన్ 18, (ప్రజా కలం)

మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో చేపట్టిన, పూర్తయిన సుమారు రూ. 87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రోడ్ల పనులకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, తిమ్మాపూర్ గ్రామానికి వివిధ ప్రాంతాలతో మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొంగర, రావిరాల, శ్రీశైలం రోడ్డు, లాచునూరు, అవరమియగూడెం జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, ఇబ్రహీంపట్నం రోడ్డు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలతో కూడా కనెక్టివిటీ పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతం పట్టణీకరణ దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు
దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించబడినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ల ఏర్పాటుకు ప్రాథమిక అంచనా వ్యయం సుమారు రూ. 5 లక్షల కోట్లు కాగా, భూసేకరణ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇది రూ. 10 లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు సంబంధించిన సర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే మరియు డీపీఆర్ పూర్తైన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే హైదరాబాద్ చుట్టుపక్కల మరో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా కూడా ఆలోచనలు జరుగుతున్నాయని, ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ. 20 వేల కోట్ల నుంచి రూ. 25 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రంగారెడ్డి జిల్లా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి అనుసంధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషితో ఈ ప్రాంతానికి కేంద్ర నిధుల ద్వారా రూ. 100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం వల్ల కొన్ని రహదారి పనులు ఆలస్యమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన మంత్రి, ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, అవరమియగూడెం తదితర ప్రాంతాలకు సంబంధించిన అన్ని రహదారి నిర్మాణ పనులను తక్షణమే సమీక్షించి, రాబోయే కొద్ది నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా కందుకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దౌల్తాబాద్, రాయపోల్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట ప్రజాకలం జూన్ 19 : సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని దౌల్తాబాద్, రాయపోల్ పోలీస్ స్టేషన్లను సీపీ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్లలో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీపీకి అధికారులు ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, బాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, పెండింగ్ కేసులపై ఎస్సై అరుణ్‌కుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు...

# అంతరించిపోతున్న కళలకు ప్రాణం పోస్తున్న కళాకారులు...!

### శ్రీ రాఘవేంద్ర స్వామి భజన మండలి వారిచే గొప్ప ప్రదర్శన
### రావిరాల గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర బయలు నాటక ప్రదర్శన
### నాలుగు రోజుల పాటు ప్రదర్శన కార్యక్రమాలు

మహేశ్వరం, జూన్ 18, (ప్రజా కలం)

అంతరించిపోతున్న కళలకు కళాకారులు ప్రాణం పోస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర బయలు నాటక ప్రదర్శన ను శ్రీ రాఘవేంద్ర స్వామి భజన మండలి వారిచే ప్రదర్శన.. 17 వ .తేదీ రోజు ఘనంగా ప్రారంభించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాలుగు రోజుల పాటు ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి రోజు కలియుగంలో పెరుగుతున్న పాప భారాన్ని మోయలేక భూదేవి నారదునితో మొరపెట్టుకుంటుంది. నారదుడు భూదేవిని త్రిమూర్తుల వద్దకు పంపగా, విష్ణుమూర్తి లోక కళ్యాణం కోసం భూమిపై అవతరించాలని నిర్ణయించుకుంటాడు విష్ణుమూర్తి వీరంబొట్లయ్య మరియు పరిపూర్ణయాచారి, ప్రకృతాంబ అనే దంపతులకు జన్మిస్తాడు ఆయన పుట్టిన కొద్ది కాలానికే తండ్రి, ఆపై తల్లి మరణిస్తారు. ప్రకృతాంబ తన కుమారుడైన వీరంబొట్లయ్యను అత్రి మహామునికి అప్పగిస్తుంది. అత్రి మహాముని ఆ బాలుని (వీరబ్రహ్మేంద్రస్వామిని) వీరభోజయాచారి వీరపాపమాంబ అనే దంపతులకు అప్పగిస్తాడు వీధి నాటక ప్రదర్శన ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా నాలుగు రోజులపాటు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను శ్రీ రాఘవేంద్ర స్వామి భజన మండలి వారు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పురాతన కళలు అంతరించిపోతున్న తరుణంలో తిరిగి కళలను అందరికీ గుర్తు చేస్తూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా పాత్రధారులు సన్నివేశాలు అందరినీ ఆకర్షించాయి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని కాటం భాస్కర్ సహకారంతో నిర్వహిస్తున్నారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by Kalakonda Ramakrishna, Printed at TEJOMAI PUBLICATION H.NO.2-24/98/B L N COLONY ,IDA UPPAL MEDCHAL-MALKAJGIRI, HYDERABAD,"TELANGANA - 500013. , Published from H.NO.10-1-7, BADA BAZAR, BESIDE POTHALINGAIAH TEMPLE, AZAM ROAD, NIZAMABAD, TELANGANA - 503001."Editor: Kalakonda Ramakrishna, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com